PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 198 | విజయవాడ, బుధవారం 19 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 19 February 2025 | Rs

ఆదాయపన్ను బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనలా ?

- మోడీ ప్రభుత్వ తీరుపై నిపుణుల విమర్శలు

7



నేటి నుంచి ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ

- పాకిస్తాన్ × న్యూజిలాండ్ మ్యాచ్‌తో ప్రారంభం
- మధ్యాహ్నం 2.30గం॥ల నుంచి

8

అభివృద్ధి ... సంక్షేమం

• సూపర్ సిక్స్‌కూ నిధులు • బడ్జెట్ రూపకల్పనపై సిఎం ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అభివృద్ధితో పాటు సంక్షేమానికి బడ్జెట్ రూపకల్పనలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. 2025-26 ఆర్థికసంవత్సరపు బడ్జెట్ రూపకల్పనపై మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పథకాలకు నిధులు కేటాయించాలని, అదే సమయంలో సంక్షేమాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని అన్నారు. సంక్షేమ పథకాలకు కూడా తప్పనిసరిగా అవసరమైన నిధులు కేటాయించాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇంకా అమలు చేయాల్సిఉన్న మూడు పథకాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలకు అవుతున్న ఖర్చుపై సిఎం ఆరా తీసినట్లు తెలిసిందే. అదే విధంగా తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాల అమలుకు ఎంత నిధులు కేటాయించాల్సిఉంటుందన్న విషయాన్ని కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. పథకాల సక్రమ నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలని సూచించారు. ఇతర పథకాలకు కూడా స్పష్టమైన అంచనాలతో కేటాయింపులు



చేయాలన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడం గమనార్హం. గత ఏడాది వరుసగా రెండుసార్లు ఓట్ ఆన్ అక్కౌంట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సమకూరే ఆదాయం, చేయవలిసిన ఖర్చులను వివరాలను బాబు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదాయం భారీగా పెరిగే అవకాశం లేదని అధికారులు ఆయనకు చెప్పినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అనర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయంటూ వస్తున్న వార్తలను సిఎం ప్రస్తావించినట్లు సమాచారం. ఈ తరహా వృదా వ్యయాన్ని అరికట్టాలని, తద్వారా అర్హులకు న్యాయం చేయడంతో పాటు, అభివృద్ధికి నిధులు అందుబాటులో ఉంటాయని ఆయన అన్నట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు 38,790 కోట్లు రాష్ట్రానికి వస్తాయని ఆర్థికశాఖ సిద్ధంచేసిన నివేదికపైనా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రేపు ఢిల్లీకి బాబు ...;?

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం ఆ రోజు జరిగే అవకాశం ఉందన్న సమాచారం మేరకు బాబు పర్యటన ఖరారైనట్లు చెబుతున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన తరువాత ఢిల్లీ నుండి నేరుగా హైదరాబాద్‌కు వెళ్తారని తెలిసింది. దీంతో ఆ రోజు జరగాల్సిన కేబినెట్ సమావేశం వాయిదా పడుతున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయుల శిక్షణకు సింఘానియాతో ఒప్పందం

- మంత్రి లోకేష్ సమక్షంలో సంతకాలు

24 తరువాత జిల్లాలకు వెళ్లండి

- అసెంబ్లీ ఉన్నా అధికార పార్టీ ఎమ్మెల్యేలకు మౌఖిక ఆదేశాలు

2

స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకింత వివక్షత?

- ఆవిర్భావ దినోత్సవాన్ని జరపకపోవడం శోచనీయం
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్లాంట్ యాజమాన్యం జరపక పోవడం బాధాకరమని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయివేటీకరణ చర్యల్లో భాగంగానే ఇదంతా జరుగుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు కర్మాగారం పట్ల, తెలుగు ప్రజల పట్ల ఎందుకింత వివక్షత అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్మృత్యంజలి పార్కు, కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ఉక్కు అమరవీరులకు వారు మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోవాల్సిన తరుణంలో ప్లాంట్ యాజమాన్యం వేడుకలు లేవని చెప్పడం దారుణమన్నారు. క్రమశిక్షణ, ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించిన ఉక్కు ఉద్యోగులు, అధికారులకు నెహ్రూ అవార్డులను ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవం రోజున ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి వాటికీ స్వస్తి చెప్పేశారని అన్నారు. ఆరు నెలలుగా ఉద్యోగుల జీతాలను సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల తొలగింపు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది తగ్గింపు వంటి చర్యలు ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తూ ఆందోళనకు గురి మిగతా 3లో

9 'వర్సిటీ'లకు విసిల నియామకం

'ఆంధ్రా'కు ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ రాజశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తొమ్మిది యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల (విసి)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన వేర్వేరు ఉత్తర్వులను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం విడుదల చేశారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ వేర్వేరు ఉత్తర్వులు విడుదల చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ (ఎయు)విసిగా ఖరగ్‌పూర్ ఐఐటి మేథమెటిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్న జిపి రాజశేఖర్‌ను నియమించింది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా ఉన్న ప్రసన్నశ్రీని ఆదికవి నన్నయ విసిగా ప్రభుత్వం నియమించింది. కృష్ణా యూనివర్సిటీకి ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఇడి కళాశాల విభాగం ప్రొఫెసర్ రామ్‌జిని నియమించింది. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ విసిగా అక్కడే ప్రొఫెసర్‌గా ఉన్న వి ఉమాను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. జెఎన్‌టియు అనంతపురం విసిగా అదే యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ హెచ్ సుదర్శన్‌రావును నియమించింది. ఉస్మానియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న వెంకటబసవరావును రాయలసీమ విసిగా నియమించింది.

ఢిల్లీ టెక్నాలజికల్ యూనివర్సిటీలో అప్లయిడ్ ఫిజిక్స్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అల్లం శ్రీనివాసరావును విక్రమ సింహపురి యూనివర్సిటి విసిగా నియమించింది. యోగి వేమన యూనివర్సిటీ విసిగా హైదరాబాద్ యూనివర్సిటీలో బయోటెక్నాలజి అండ్ బయో ఇన్‌ఫర్‌మెటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఫణితి ప్రకాష్‌బాబును నియమించింది. వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ సిఎస్‌ఆర్‌కె ప్రసాద్‌ను జెఎన్‌టియు కాకినాడ విసిగా నియమించింది.

పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అదుపులోకి తీసుకుని వ్యక్తులను కొట్టారని ఆవేదనను తెలియజేసింది. కేసులు పెట్టి లోపలే వదిలేయడంపై విస్మయం వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం లేదని తప్పుబట్టింది. బోసా రమణ అనే వ్యక్తి అరెస్టులో చేసిన దర్యాప్తు నివేదికను ఎందుకివ్వడం లేదని నిలదీసింది. రమణ అరెస్టు విషయాన్ని డిజిపికి చెప్పాలన్న గత ఆదేశాల మేరకు డిజిపి ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించింది. నివేదికలు ఇవ్వడానికి ప్రకాశం జిల్లా ఎస్‌పి, విశాఖపట్నం కమిషనర్లకు ఈ నెల 25 వరకు గడువు ఇస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కె మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, మంత్రి లోకేష్ ఇతరులపై సోషల్ మీడియాలో విమర్శల పోస్టులు పెట్టారంటూ విశాఖపట్నంకు చెందిన రమణను పోలీసులు అరెస్టు చేయడంతో ఆయన భార్య బి లక్ష్మి హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ జరిపిన హైకోర్టు పై విధంగా వాఖ్యలు చేసింది. విచారణలో భాగంగా ఇచ్ఛాపురం సిఐ చిన్నం నాయుడు, పొదిలి సిఐ టి వెంకటేశ్వర్లు వ్యక్తిగతంగా హైకోర్టుకు హాజరై వివరణ ఇచ్చారు.

భారత్, ఖతార్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యం

ఒప్పందంపై ఇరు పక్షాల సంతకాలు

న్యూఢిల్లీ : భారత్, ఖతార్‌ల మధ్య సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్ళేందుకు ఒప్పందం కుదిరింది. రెండు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన ఖతార్ అమీర్ తమిమ్ బిన్ హమద్ అల్ థానితో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ భేటీలో గాజాలో ఇజ్రాయిల్ దాడులతో సహా పలు అంశాలపై ఇరువురు నేతలు కూలంకషంగా చర్చించారని విదేశాంగ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదుర్చుకునేందుకు గల అవకాశాలను ఇరు వర్గాలు అన్వేషించాయని తెలిపింది. ప్రస్తుతమున్న ద్వైపాక్షిక సంబంధాల స్థాయిని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్ళాలని ఇరు పక్షాలు భావించాయని మీడియాతో మాట్లాడుతూ కార్యదర్శి అరుణ్ కుమార్ చటర్జీ తెలిపారు. ద్వంద్వ పన్నులను నివారించే ఒప్పందంపై కూడా ఇరుపక్షాలు సంతకాలు చేశాయని తెలిపారు. ఇది కాకుండా వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, భద్రత వంటి పలు రంగాలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ వేదికలపై సహకారం పెంపునకు చర్యలు



న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సమావేశమైన ప్రధాని మోడీ, ఖతార్ అమీర్ తమిమ్ బిన్ హమద్ అల్ థాని

తీసుకుంటున్నామని తెలిపారు.

గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాల్లో కువైట్, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియాలతో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ఇరు పక్షాలు అభిప్రాయాలు పంచుకున్నారని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి.

సౌదీ రాజధాని రియాద్‌లో ఐదు అరబ్ దేశాల సదస్సు జరగడానికి రెండు రోజులు ముందుగా ఖతార్ అమీర్ భారత్‌లో పర్యటించడం అందరి దృష్టిని ఆకట్టుకుంది. గాజాపై ట్రంప్ తాజా ప్రతిపాదన నేపథ్యంలో ఈ సదస్సు జరుగుతోంది. అమెరికా ఈ కొత్త విధానంపై భారత్ మిగతా 3లో

ఐదారు నెలల్లో మహిళలకు క్యాన్సర్ టీకా

- కేంద్రమంత్రి జాదవ్

ఛత్రపతి శంభాజీనగర్ : మహిళల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న క్యాన్సర్లను ఎదుర్కొనేందుకు ఐదు నుంచి ఆరు నెలల్లో టీకా అందుబాటులోకి రానుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆయూష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ ప్రకటించారు. ఈ టీకా రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను నిరోధిస్తుందని తెలిపారు. ఈ టీకా వేసుకొనేందుకు 9 నుంచి 16 ఏళ్ల వయసు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఈ టీకాపై పరిశోధనలు పూర్తయ్యాయని, ప్రస్తుతం ట్రయల్స్ కొనసాగుతున్నాయన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు 30 ఏళ్లు పైబడిన మహిళలకు స్క్రీనింగ్ నిర్వహిస్తామని, డేకేర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే, క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేసినట్లు చెప్పారు.

పేరుకే మూడంచెల విధానం

- ప్రైమరీలో రెండు రకాల స్కూళ్లే
- 'బేసిక్' ఉండకూడదని అధికారుల ఆదేశాలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ బడులను మూతవేసే విషయంలో ఏ ప్రభుత్వమూ తగ్గడం లేదు. టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ బడుల గొంతు నొక్కడంలో ఒకేలా వ్యవహరిస్తున్నాయని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అంటున్నారు. వైసిపి హయాంలో పాఠశాలలు మూతపడుతున్నాయని గగ్గోలు పెట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్న స్కూళ్లను మూతవేయాలని ప్రయత్నిస్తోంది. ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా సాల్ట్ పేరుతో పరోక్షంగా మూతవేసే విధానాలను అవలంబిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జివో వల్ల వేల పాఠశాలలు మూతబడ్డాయి. ఈ జివోకు ప్రత్యామ్నాయం పేరుతో టిడిపి ప్రభుత్వం ప్రాథమిక విద్యలో మూడు రకాల పాఠశాలలను ప్రవేశపెట్టింది. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో మూడు రకాల పాఠశాలలను ప్రవేశపెట్టింది. ఫౌండేషన్ పాఠశాలలో పిపి1, పిపి2తో పాటు 1,2 తరగతులు ఉంటాయి. బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో పిపి1, పిపి2లతో పాటు 1 నుంచి 5 తరగతులు ఉంటాయి. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ కాన్సెప్ట్ పేరుతో విద్యార్థుల సంఖ్య 60 ఉన్న వాటిని మోడల్‌గా మారుస్తామని విద్యాశాఖ ఆదేశాల్లో పేర్కొంది. వీటితో పాటు బేసిక్ స్కూళ్లు కూడా ఉంటాయని తెలిపింది. ఉత్తర్వుల్లో మూడు అంచెలు పెట్టిన అధికారులు ఆచరణలో మాత్రం రెండే ఉండాలని ప్రధానోపాధ్యాయులపై మౌఖిక ఆదేశాలతో ఒత్తిడి తేస్తున్నారు. పంచాయతీలో ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ పాఠశాలలే ఉండాలని ఆదేశిస్తున్నారు. మోడల్ స్కూల్ దూరంగా ఉండే విద్యార్థులు బేసిక్ స్కూల్‌కు వెళ్తారని, దానిని కూడా కొనసాగించాలని కోరుతున్న ఉపాధ్యాయులను కించపరిచే విధంగా ఉన్నతాధికారులే మాట్లాడుతున్నట్లు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 3,4,5 తరగతులకు బడి దూరమయితే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలకు పంపుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఉన్నతాధికారులు ఉపాధ్యాయుల మాటలను పెడచెవిన పెడుతున్నారు. ప్రతి నెల మూడో శనివారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన ఈ సమావేశాల్లో ఈ అంశంపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. పాఠశాలలను మూసివేయడానికి లేదా విలీనం చేయడానికి స్థానిక ప్రజలను ఒప్పించే బాధ్యత కూడా ఉపాధ్యాయులదేనని అధికారులు చెప్పడంతో దానిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైందని సమాచారం.



చెన్నైలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

పోరాటాల మేదోమథనానికి విరాళాలతో ప్రజల అండ

- సిపిఎం అఖిలభారత మహాసభకు సిద్ధమౌతున్న తమిళనాడు

8

అనంతలో మరో విద్యార్థి ఆత్మహత్య

- మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాలు

2

విమాన కంపెనీల నిలువు దోపిడి

- రూ.30 వేల వరకు పెంచిన ఛార్జీలు
- మహాకుంభమేళా భక్తుల జేబుకు చిల్లు
- డిజిసిఎ చర్యలు అంతంత మాత్రమే

3



విజయవాడ సబ్‌జైలులో వంశీని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

వంశీకి జగన్ పరామర్శ

రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయని విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో అరెస్టయి విజయవాడ సబ్‌జైల్లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో తాడేపల్లిలోని తన నివాసం నుండి ఆయన నేరుగా విజయవాడ సబ్‌జైలుకు వెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సమాచారం తెలుసుకున్న వైసిపి కార్యకర్తలు పెద్దఎత్తున సబ్‌జైలు వద్దకు చేరుకున్నారు. ములాఖత్‌కు వెళ్లిన వారిలో జగన్‌తోపాటు వంశీ భార్య పంకజశ్రీ, అవనిగడ్డ మాజీ ఎంఎల్‌ఏ సింహాద్రి రమేష్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు ములాఖత్‌కు వెళ్లేందుకు జగన్‌తోపాటు పేర్ని నాని, కొడాలి నానికి అనుమతి తీసుకున్నారు. చివర్లో భద్రత, కేసుల కారణాలతో వారిద్దరినీ అధికారులు తిరస్కరించారు. దీంతో జగన్ వెంట సింహాద్రి రమేష్ జైలులోకి మిగతా 3లో

త్వరలో వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోలు

- రైస్ మిల్లర్ల యాజమాన్యాలతో మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోలుతోపాటు పేపర్ లెస్ అడ్మినిస్ట్రేషన్‌ను త్వరలో ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా ప్రవేశపెట్టనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు 7337359375 వాట్సాప్ నెంబరును కేటాయించామన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని సివిల్ సప్లయి భవన్‌లో రైస్ మిల్లర్స్ నిర్వాహకులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 5.21 లక్షల మంది రైతుల నుంచి 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇందుకోసం రూ.7,522 కోట్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ప్రైవేట్ గోడాన్స్ వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు గోడౌన్‌లో ఉన్న సరుకు నిల్వ, భద్రతను టెక్నాలజీ ద్వారా పర్యవేక్షించేందుకు ప్రతి గోడౌన్ వద్ద ఎఐ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. రవాణా ఖర్చులను తగ్గించేందుకు రైల్వే లైన్ సమీపంలోని గోడౌన్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నాదెండ్ల వెల్లడించారు. ఈ సమావేశంలో కమిషనరు సౌరబ్ గౌర్, ఎమ్‌డి మన్‌జీర్ జిలానీ, ఆయిల్ మార్కెటింగ్ ప్రతినిధులు, ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సివిల్ సప్లయిస్ హమాలీలకు కూలి రేట్లు పెంచకుంటే దశలవారీ ఆందోళన

- మంత్రి నాదెండ్లను కలిసిన ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సివిల్ సప్లయి హమాలీలకు కూలిరేట్లు రూ.25 నుంచి రూ.28లకు పెంచాలని, 14 నెలల ఎరియర్స్ చెల్లింపు జిఓ జారీ చేయలేని పక్షంలో దశలవారీ ఆందోళన, పోరాటాలకు పూనుకోవాల్సి వస్తుందని ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ పేర్కొంది. ఈ మేరకు విజయవాడ ఆటోనగర్‌లోని సివిల్ సప్లయి కార్యాలయంలో యూనియన్ నాయకులు కె ఉమామహేశ్వరరావు, ఆర్ కృష్ణ, ఎస్ భాస్కరరావు, ఆంజనేయులు, మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం మంగళవారం మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లోగా హమాలీల కూలిరేట్లు పెంపు, ఎరియర్స్ చెల్లింపునకు అవసరమైన జిఓ జారీ చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

రేషనలైజేషన్‌లో విఆర్‌ఒలకు అన్యాయం

- భూపతిరాజు రవీంద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో విఆర్‌ఒలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా గ్రామ స్థాయిలో రైతులు, ప్రజలకు అనుసంధానంగా ఉండి భూ సమస్యలు, సర్టిఫికెట్ల మంజూరుతోపాటు ప్రభుత్వ కార్యక్రమాల అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో ఎంతో మంది విఆర్‌ఒలు పని ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నారన్నారు.

అనంతలో మరో విద్యార్థి ఆత్మహత్య

- మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి/అనంతపురం క్రైం

అనంతపురం జిల్లాలో మరో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫీజుల ఒత్తిళ్లు తాళలేక నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించి విద్యార్థి తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం మలకాపురం గ్రామానికి చెందిన అక్కులప్ప, నారాయణమ్మల కుమారుడు శ్రీకాంత్ (17) అనంతపురం నగర సమీపంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ విద్యార్థి సోమవారం రాత్రి కళాశాల హాస్టల్ నుంచి బయటకు వెళ్లాడు. ఎక్కడికో వెళ్లాడని తోటి విద్యార్థులు భావించారు. ఉదయానికి కళాశాల వెనుకవైపున్న దానిమ్మ తోటలోని వేపచెట్టుకు డ్రిప్ వైర్లతో ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని హాస్టల్ గదిలో నుంచి గమనించిన తోటి విద్యార్థులు సమాచారాన్ని కళాశాల యాజమాన్యానికి తెలియజేశారు. తల్లిదండ్రులకు విషయం తెలియడంతో అక్కడకు చేరుకున్నారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ మృతదేహంతో కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. విద్యార్థి రాత్రి నుంచి కనిపించకుండా పోయినా తమకు కనీస సమాచారం ఇవ్వలేదని వాపోయారు. తక్షణం కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనకు ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. జిల్లాలో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి ఆత్మహత్యలపై తక్షణం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రూరల్ సిఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘం నాయకులకు సర్దిజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. చదువులో ఒత్తిడిని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణ చేశారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


శ్రీకాంత్ (ఫైల్‌ఫోటో)


విద్యార్థి మృతదేహంతో కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు

విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

అనంతపురం జిల్లాలో విద్యార్థుల మరణాలు వరుసగా సంభవిస్తున్నాయి. గత నెలలోనే నారాయణ విద్యా సంస్థల్లో ఒక విద్యార్థి తరగతి గది మూడవ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది మరువక ముందే మరో విద్యార్థి ఇప్పుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మరణాలపై అధికారులు వెంటనే స్పందించి సమగ్రమైన విచారణ చేపట్టాలి ఫీజుల ఒత్తిడులు, చదువుల ఒత్తిడితోనే ఇవి సంభవిస్తున్నాయన్నాయి.

- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనంతపురం

24 తరువాత జిల్లాలకు వెళ్లండి

- అసెంబ్లీ ఉన్నా అధికార పార్టీ ఎమ్మెల్యేలకు మౌఖిక ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అసెంబ్లీ సమావేశాలు జరుగుతూ ఉన్నా 24వ తేది తరువాత జిల్లాలకు వెళ్లాలని పలువురు అధికారపార్టీ ఎంఎల్‌ఎలకు మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతుండటమే దీనికి కారణం. 24వ తేది అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఆ రోజు రాష్ట్ర రాష్ట్ర గవర్నర్ ఉభయ సభల నుద్దేశించి ప్రసంగిస్తారు. 25వ తేది గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభం కావాల్సిఉంది. అయితే, 27వ తేది ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికారపార్టీ ఎన్నికలు జరుగుతున్న జిల్లాల ఎంఎల్‌ఎలకు గవర్నర్ ప్రసంగం ముగిసిన వెంటనే తమ నియోజకవర్గాలకు తిరిగి వెళ్లి పోలింగ్ ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించినట్లు తెలిసింది. 25వ తేది చర్చ ప్రారంభమైనా 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా అసెంబ్లీకి సెలవు. దీంతో 27వ తేది తిరిగి అసెంబ్లీ సమావేశం కావాల్సిఉంది. అదే రోజు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కూడా ఉండటంతో ఎంఎల్‌ఏలు సభకు వచ్చే అవకాశం లేదు. దీంతో 25, 27 తేదీల్లో సభ్యుల హాజరు నామమాత్రంగానే ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సభ నిర్వహణ తేదీలపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది. బడ్జెట్‌ను 28నే ప్రవేశపెడతారా లేక మార్చి మూడో తేదీకి మార్చే అవకాశం ఉందా అన్న అంశంపై కూడా నిర్ణయం తీసుకోవాల్సిఉంది.

'ప్రజాశక్తి' విలేకరిపై దాడి చేసిన టిడిపి నేతను అరెస్టు చేయాలి

- ఎపియుడబ్ల్యుజె డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరు రామారావుపై దాడి చేసి చంపుతామని బెదిరించిన టిడిపి నేత వేణుగోపాల్‌నాయుడుపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవి సుబ్బారావు, చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్‌లో బ్యానర్లు అలానే ఉంచారని వార్త రాస్తే దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీ శ్రేణులు జర్నలిస్టుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై మంత్రి జోక్యం చేసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా శ్రేణులను కట్టడి చేయాలని, లేదంటే జర్నలిస్టుల నిరసనను ఎదుర్కోక తప్పదన్నారు.

మక్కువ ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన నిందితుడిపై చర్యలు

- జర్నలిస్టులకు రక్షణ కల్పిస్తాం
- ప్రజాశక్తి బృందానికి సమాచారశాఖ మంత్రి పార్థసారథి హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడి చేసి చంపుతానని హెచ్చరించిన మక్కువ మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడుపై చర్యలు తీసుకోవడంతో పాటు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, సమాజ శ్రేయస్సు కోసం వార్తలు రాస్తున్న రామారావుపై ఈ విధంగా వ్యవహరించిన వేణుగోపాల్ నాయుడుపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ ప్రజాశక్తి దినపత్రిక ఎడిటర్‌బి.తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి కె.ఎస్.వి.ప్రసాద్, స్టేట్ మొఫిసిల్ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాసరావు, జనరల్ మేనేజరు కె.హరికిశోర్ మంగళవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరిపై జరిగిన దాడి, బెదిరింపు గురించి మంత్రి పార్థసారధికి వివరించారు.

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడి చేసి, చంపేస్తానంటూ మక్కువ మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు హెచ్చరించారు.

'ఎన్నికల కోడ్ అధికారులకు పట్టదా?' శీర్షికతో ఈ నెల 3వ తేదీన 'ప్రజాశక్తి' దినపత్రికలో వచ్చిన వార్త రాయడం పట్ల కక్షపెట్టుకున్న వేణుగోపాల్ నాయుడు ఈ నెల 16న (ఆదివారం) ఎ.వెంకంపేట-కాశీపట్నం రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనకు వెళ్లిన విలేకరి రామారావుపై అసభ్యపదజాలంతో దూషించి దాడి చేశారు. 'చంపేస్తా' అంటూ హెచ్చరించారు. దీనిపై అదే రోజు మక్కువ పోలీస్ స్టేషన్లో విలేకరి ఫిర్యాదు చేశారు.

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులు అటువంటి దాడులకు పాల్పడితే ప్రజాస్వామ్యం బలహీన పడుతుంది. కనుక వేణుగోపాల్ నాయుడిపై చర్యలు తీసుకుంటే పత్రికా స్వేచ్ఛకు, పాత్రికేయుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్రంలోని జర్నలిస్టులు భావిస్తారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు, వారికి ఆత్మవిశ్వాసం కలిగించేందుకూ తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


సమాచార శాఖ మంత్రి పార్థసారధికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్, సిజిఎం వై అచ్యుతరావు, తదితరులు

కేసు నమోదు చేయాల్సిందే : కెవిపిఎస్

'నిన్ను చంపడం ఖాయం' అంటూ రామారావుపై చేయి చేసుకున్న టిడిపి నేత వేణుగోపాల్ నాయుడుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

117 జిఓ ప్రత్యామ్నాయంపై త్వరలో వర్క్‌షాప్

- వివాదాలకు తావు లేకుండా టీచర్ల సీనియార్టీ జాబితా
- సమీక్షలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



గత ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 117కు ప్రత్యామ్నాయ వ్యవస్థపై త్వరలోనే ప్రజా ప్రతినిధులతో వర్క్‌షాప్ నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రజా ప్రతినిధులతో నిర్వహించి వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా వారి సీనియార్టీ జాబితాను రూపొందించాలని ఆదేశించారు. జూనియర్ కళాశాలల్లోని గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలు పెంపుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జూనియర్ లెక్చరర్ల బదిలీలు విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే చేపట్టాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు అంశంపై ఈ నెల 20న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షిస్తామని తెలిపారు. మాజీ సిఎం వైఎస్ జగన్ అనాలోచితంగా తీసుకొచ్చిన జిఓ 42 ద్వారా 80 ఎయిడెడ్ కళాశాలలు మూతపడ్డాయని విమర్శించారు. ఎయిడెడ్ కళాశాలల ఆస్తులు కాజేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నైపుణ్య గణన కార్యక్రమాన్ని నిపుణుల సలహాలతో మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దాలన్నారు. స్కిల్ సెన్సెస్‌ను సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని అనుసంధానించాలని సూచించారు. యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా స్థాయిలో జిల్లా ఉపాధి కల్పనా అధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, సీడ్ యాప్ పరిధిలో ఉన్న జిల్లా మేనేజర్ విధులను సమగ్రంగా పరిశీలించి ఏకీకృత వ్యవస్థను తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, పాఠశాల విద్యాశాఖల ముఖ్యకార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరెక్టర్ వి విజయ్ రామరాజు, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా, సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఎమ్‌డి గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణకు సింఘానియాతో ఒప్పందం

- మంత్రి లోకేష్ సమక్షంలో సంతకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యా నైపుణ్యాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో ఒప్పందం చేసుకుంది. విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యాన ఈ ఎంఒయు జరిగింది. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, సింఘానియా గ్రూప్ ప్రతినిధి సంతకాలు చేశారు. తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యత, ఉపాధ్యాయుల శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకొచ్చి పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్ల వ్యవధిలో అమలు చేసే ఈ కార్యక్రమం ద్వారా లక్షమంది విద్యార్థులకు మెరుగైన విద్య అందేటట్లు నిర్ణయించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా రంగాన్ని దేశంలోనే మొదటిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు. కెజిటు పిజి విద్య కరిక్యులమ్‌లో సమూల మార్పులు తెస్తున్నామని తెలిపారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సింఘానియా గ్రూప్ ఛైర్మన్ హరి సింఘానియా మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతంగా తయారుచేయడమే తమ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్, సింఘానియా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రేవతి శ్రీనివాస్, రేమాండ్స్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కె నరసింహమూర్తి, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ జతిన్ ఖన్నా, ట్రస్ట్ ప్రిన్సిపల్ రేవతి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



మొన్న లోకేష్ ... నిన్న పవన్

- కుంభమేళాలో స్నానాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రయాగ్‌రాజ్ వద్ద జరుగుతున్న మహా కుంభమేళాకు రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి లోకేష్ సోమవారం వెళ్లగా, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం వెళ్లారు. ఇరువురు నేతలు తమ కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణి సంగమం వద్ద స్నానాలు చేసి, గంగా నదికి పూజలు చేశారు. లోకేష్‌తో పాటు ఆయన భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ కుంభమేళాలో పాల్గొన్నారు. పవన్‌కల్యాణ్‌తో ఆయన భార్య అన్నా లెజినోవా, కుమారుడు అకీరా నందన్ సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ ఉన్నారు.



స్థానికులకే 'బంగారు' ఉద్యోగాలు

'జియో మైసూర్' ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి -పత్తికొండ/తుగ్గలి (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలో జియో మైసూర్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో గోల్డ్ మైనింగ్ విస్తరణ కోసం పర్యావరణ కాలుష్యంపై మంగళవారం ప్రజా అభిప్రామ సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో పత్తికొండ రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్.భరత్‌నాయక్, పర్యావరణ కంట్రోల్ బోర్డు అధికారి కిషోర్, చీఫ్ ఇంజనీర్ మునిస్వామి, తుగ్గలి తహశీల్దార్ రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ.. పరిశ్రమ విస్తరణల్లో ఉద్యోగావకాశాలు స్థానికులకే కల్పించాలని, పరిశ్రమ నుంచి వెదజల్లే కాలుష్యాన్ని నివారించేందుకు.. అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం తుగ్గలి మండల కార్యదర్శి శ్రీ రాములు మాట్లాడుతూ జొన్నగిరి, పగడరాయి, గొల్లవానిపల్లి గ్రామాలలో భూమి కోల్పోయిన కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఐ నాయకుడు నబీరసూల్ మాట్లాడుతూ.. మరుగుదొడ్లు, సెక్యూరిటీ గార్డ్ వంటి ఉద్యోగాలు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్నత ఉద్యోగాలు ఇచ్చి గౌరవంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జొన్నగిరి గ్రామానికి చెందిన చిట్టెమ్మ మాట్లాడుతూ రూ.పది వేల జీతంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని, పిల్లాపాపలను ఎలా బతికించుకోవాలని ప్రశ్నించారు. కనీసం వేతనం రూ.30 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ సమితి కార్యకర్త జెట్టి రామారావు మాట్లాడుతూ పరిశ్రమ కోసం భూమి కోల్పోయిన కుటుంబాలకు అమరావతి తరహాలో ప్యాకేజీ కేటాయించాలని, బ్యాంకు అప్పులను రద్దు చేయాలని, ఏటా రూ.50 వేలు ఆ కుటుంబానికి పోషణ కోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా జియో మైసూర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ హనుమప్ప మాట్లాడుతూ జొన్నగిరి ప్రాంతంలో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును మోడల్‌గా తీర్చిదిద్ది, గ్రామాలను ఆదర్శవంతంగా మారుస్తామన్నారు. విద్య, వైద్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా పత్తికొండ రూరల్ సిఐ పులిశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జాడలేని 'సూపర్ సిక్స్'

- ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి - మైలవరం (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్నికల హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. 'సూపర్ సిక్స్' అమలు జాడ కనిపించడంలేదని తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను, ప్రజా సమస్యలను మరిచి కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేస్తోందన్నారు. ఓవైపు అప్పులకు వడ్డీలు కడుతున్నామంటూనే మరోవైపు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే పనిలో ఉందని విమర్శించారు. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందని తెలిపారు. ఉద్యోగాల జాడ లేకుండా పోయిందని, డిఎస్‌సి ప్రకటనలకే పరిమితమైందని వివరించారు. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ప్రకటన ఎమ్మెల్సీ ఎన్నికల స్టంట్ తప్ప ఉద్యోగులపై ప్రేమ కాదన్నారు. అంగన్‌వాడీలు దీనిని పోరాడి సాధించుకున్నారని తెలిపారు. అంగన్‌వాడీలు గత ప్రభుత్వంపై పోరాడి సాధించుకున్న 11 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, రైతాంగ కుటుంబాలు ఆలోచించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రలోభాలకు గురికాకుండా.... విద్యావంతులను, నిబద్ధత, నిజాయితీ కలిగి రాజ్యాంగ విలువలు తెలిసిన వ్యక్తులను శాసనమండలికి పంపాలని కోరారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ మాట్లాడుతూ మిర్చి పంట తెగుళ్లబారిన పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికీ తీవంగా నష్టపోయారని తెలిపారు. పేనుబంక తదితర తెగుళ్లతో మామిడి, మొక్కజొన్న రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో 8 మందికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యువకుడి హత్య కేసులో ఎనిమిది మందికి జీవితఖైదు విధిస్తూ ఒంగోలు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి రాజావెంకటాద్రి మంగళవారం తీర్పు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మడి ప్రకాశం జిల్లా జెపంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన బూరగ రత్నంబాబు (22), అదే గ్రామానికి చెందిన షేక్ కరిష్మా ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను కరిష్మా తరపు కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో కుటుంబ సభ్యులకు దూరంగా వెళ్లి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కరిష్మా కుటుంబ సభ్యులు రత్నంబాబును హత్య చేసేందుకు కుట్ర పన్నారు. దీనిలో భాగంగా ఆమె మేనమామలు నజీరు, మున్నీర్ బాష అతడి స్నేహితుడు అన్వర్ బాషలు కలిసి రత్నంబాబు ఇంటికి వెళ్లారు. పెళ్లికి అంగీకరిస్తున్నట్లు చెప్పి ఒప్పించారు. మరోసారి 2015 ఏప్రిల్ 28న మున్నీర్ బాషా, అన్వర్‌బాషాలు రత్నంబాబు ఇంటికెళ్లి జెపంగులూరు మసీదులో వివాహం నిశ్చయించామని, దాని కోసం వలపర్లలో బట్టలు కొనుగోలు చేయాలని చెప్పి ఆయన్ను రామకూరు సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ మరికొందితో కలిసి రత్నంబాబును కత్తులతో పొడిచి హత్య చేశారు. మృతుడి తల్లి ఏసుదయమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి మార్టూరు ఎస్ఐ కేసు నమోదు చేశారు. అప్పటి చీరాల డిఎస్‌పి సి.జయరామరాజు కేసు దర్యాప్తు చేపట్టి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. కేసు విచారణ అనంతరం ఒంగోలు అడిషనల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి టి.రాజావెంకటాద్రి తీర్పు చెప్పారు. హత్యలో పాల్గొన్న షేక్ మున్నీర్ బాష, షేక్ అన్వర్ బాష, షేక్ నజీర్, షేక్ కరిముల్లా, షేక్ బాజీ బుడే, షేక్ సద్దాం హుస్సేన్, షేక్ షకీల, పటాన్ మౌలాలికు జీవితఖైదు, ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. షేక్ మస్తాన్ అనే నిందితుడు గతంలోనే మరణించారు. ఈ కేసులో నిందితులకు శిక్షపడే విధంగా దర్యాప్తు నిర్వహించిన పోలీస్ అధికారులను ఎస్‌పి తుషార్‌డూడి ప్రత్యేకంగా అభినందించారు.

తునిలో ఉద్రిక్తత

టిడిపి, వైసిపి శ్రేణులపై పోలీసుల లాఠీఛార్జి
కోరం లేక వైస్ చైర్మన్ ఎన్నిక నాలుగోసారి వాయిదా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య తీవ్ర వివాదం చోటుచేసుకోవడంతో అక్కడ ఆందోళన వాతావరణం ఏర్పడింది. తుని మున్సిపల్ కౌన్సిలర్లు 30 మందికిగానూ ఒకరు మృతి చెందారు. మరొకరు ఉద్యోగం రావడంతో వెళ్లిపోయారు. దీంతో 28 మంది మిగిలారు. ఇందులో పది మంది ఇటీవలే టిడిపి కండువా కప్పుకున్నారు. మిగిలిన 18 మంది వైసిపిలోనే ఉన్నారు. ఇక్కడ వైఎస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ నెల 3, 4 తేదీల్లో రెండు సార్లు వాయిదా పడింది. సోమవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ, వైసిపి కౌన్సిలర్లను టిడిపి శ్రేణులు అడ్డుకోవడంతో కోరం లేక ఎన్నిక నిలిచింది. మంగళవారం మరోసారి నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

ఈ నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నిక కోసం పది మంది టిడిపి కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాగా వైసిపి కౌన్సిలర్లు ఎవరూ రాలేదు. వైసిపి కౌన్సిలర్లను చైర్మన్ నివాసంలో దాచేశారని, టిడిపి శ్రేణులు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను బద్దలుకొడుతూ వైసిపి కౌన్సిలర్లను దాచిన ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం చేశారు. వైసిపి శ్రేణులు కూడా చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు.


లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

మరోసారి వాయిదా

తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వరుసగా నాలుగోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్టు ప్రిసైడింగ్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. కోరం ఉండాలంటే 15 మంది అవసరమని మంగళవారం పది మంది మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేసినట్టు తెలిపారు. ఇక్కడి పరిణామాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్‌కు తెలియజేశామని, తదుపరి ఎన్నిక ఎప్పుడు నిర్వహించేది రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

నాయకులను అడ్డుకున్న పోలీసులు

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో సోమవారం జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా 'చలో తుని'కి పిలుపునిచ్చారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు తునికి పయనమయ్యారు. ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

రాజమహేంద్రవరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను హౌస్ అరెస్ట్ చేశారు. వైసిపి నాయకులు ముద్రగడ్డ పద్మనాభం, కురసాల కన్నబాబు, తోట నరసింహం, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, అనంతబాబులను తుని రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు.

భూ వివాదాల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ : ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

న్యాయపరమైన వివాదాలకు తావు లేకుండా ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న భూ సమస్యలకు ముగింపు పలికేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఆర్‌పి సిసోడియా పేర్కొన్నారు. అటవీ రెవెన్యూశాఖల మధ్య నెలకొన్న భూ వివాదాల పరిష్కారమే ధ్యేయంగా మంగళవారం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్, అటవీ, మారిటైమ్ బోర్డు, ఎపిఐఐసి ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాన్ని సిసిఎల్ఎ జయలక్ష్మి కో-ఆర్డినేట్ చేశారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ.. ఉన్నత స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసినప్పుడే సరిహద్దు వివాదాలకు ముగింపు లభిస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రాజాపురం మూలపేట భూముల వ్యవహారం, నెల్లూరు రూరల్ మండలం ఆమనచర్లలో ఎపిఐఐసి, అటవీశాఖ మధ్య యాజమాన్య హక్కుల విషయం, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం, బ్రాహ్మణ పల్లి, శకునాల గ్రామాల పరిధిలో సరిహద్దు వివాదంపైనా సమావేశంలో చర్చించారు. గని రిజర్వు ఫారెస్ట్‌కు, అక్కడ నిర్మించనున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం భూములకు మధ్య సరిహద్దు రేఖ పరంగా అస్పష్టత నెలకొనడంతో సిసోడియా స్పష్టతనిస్తూ రెవెన్యూ, అటవీశాఖల సంయుక్త ఆధ్వర్యాన రీసర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్ లైఫ్) చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్, సర్వే సెటిల్‌మెంట్ అదనపు సంచాలకులు గోవిందరావు, కర్నూలు కలెక్టరు రంజిత్ బాషా, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ పాల్గొన్నారు.

త్వరలో పెట్టుబడులు వస్తాయి

- కేంద్ర మంత్రి కె రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సుముఖంగా ఉన్నారని, వారు త్వరలో రాష్ట్రానికి వస్తారని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. గుంటూరులోని హిందూ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు జరగకపోయినా తర్వాత రాష్ట్రానికి వస్తారని తెలిపారు. ఇప్పుడు తాము పెట్టుబడులు పెడితే తమ భవిష్యత్తు ఏమిటి? మళ్లీ వైసిపి వస్తే తమ పరిస్థితి ఏమిటన్న భయం పారిశ్రామికవేత్తల్లో ఉందని, ఇది దావోస్‌లోనే చర్చకు వచ్చిందని చెప్పారు. త్వరలో చాలామంది పెట్టుబడిదారులు రాష్ట్రానికి వస్తారని చెప్పారు. 17 ఏళ్ల తర్వాత బిఎస్ఎన్ఎల్ లాభాల బాట పట్టిందన్నారు. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, పెట్టుబడులు, ఎగుమతులు ప్రధాన రంగాలుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను రూపకల్పన చేశారని పేర్కొన్నారు.

టిటిడి ఉద్యోగిపై బోర్డు మెంబర్ సీరియస్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిటిడి బోర్డు మెంబర్ నరేష్‌కుమార్ తన మిత్రులతో మంగళ వారం శ్రీవారిని దర్శించుకుని బయటకు వస్తూ 'మహాద్వారం' గేటు తెరవలేదని.. టిటిడి ఉద్యోగిపై సీరియస్ అయ్యారు. 'నేను బోర్డు మెంబర్‌ని వస్తున్నానని మీకు తెలియదా' అంటూ విరుచుకుపడ్డారు. ఉద్యోగి సమాధానం చెప్పేలోపే 'ఎవడ్రా ఇక్కడ డ్యూటీ వేసింది, బయటకు తరిమేయండి..' అంటూ బండబూతులు తిట్టారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి 'మీరు బోర్డు మెంబర్ అని అతనికి తెలియదు' అని సర్ది చెప్పారు. అక్కడకు సమీపంలో ఉన్న మీడియా మిత్రులు ఈ ఘటన కవర్ చేస్తుండగా 'తీసింది చాలయ్యా' అంటూ మీడియాపైనా బోర్డు మెంబర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బోర్డు మెంబర్ అయి ఉండి ఈ విధమైన బండబూతులతో శ్రీవారి సన్నిధిలో మాట్లాడటం విమర్శలకు తావిచ్చింది.

విమాన కంపెనీల నిలువు దోపిడి

- ఛార్జీలు రూ.30 వేల వరకు పెంపు
- కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు

న్యూఢిల్లీ : మహాకుంభమేళా డిమాండ్‌ను ఆసరగా చేసుకోని విమానయాన కంపెనీలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతోన్నాయి. సాధారణ రోజుల్లో రూ. 5000 నుంచి రూ.10,000 లోపు ఉండే ఛార్జీలను ఏకంగా రూ.30వేలకు చేర్చాయి. అడ్డగోలుగా ఛార్జీలు పెంచి.. భక్తులను నిలువు దోపిడి చేయడంపై కేంద్రానికి ఫిర్యాదులు అందుతున్నాయి. మహా కుంభమేళా ఈ నెల 26న శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్ వస్తోన్నారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలోనే తరలివస్తున్నారు. ఇందుకోసం విమానయాన కంపెనీలు ప్రత్యేక విమానాలు నడుపుతున్నాయి. గత రెండు రోజులుగా ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం నుంచి నడిచే విమానాల సంఖ్య 100 మార్క్‌ను దాటింది. స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా, ఇండిగో తదితర విమానయాన సంస్థలు ఈ నెల చివరి వరకు విమానాలను నడిపేందుకు షెడ్యూల్ చేశాయి. ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు తాజాగా రూ.13వేలకు తక్కువ కాకుండా ధర ఉండగా.. కొన్ని తేదీల్లో రూ.20వేలకుపైగా వసూలు చేస్తోన్నాయి. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఏకంగా రూ.28వేల నుంచి రూ.32వేలు, ప్రయాగ్‌రాజ్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో రూ.33వేల వరకు విమాన ఛార్జీలు వసూలు చేస్తోన్నాయి.

మంగళవారం ప్రయాగ్‌రాజ్ నుంచి బెంగళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ.39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10వేల లోపు ఉన్న విమాన ఛార్జీలను.. కుంభమేళా సమయంలో బెంగళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా మరింత దండుకోవడం గమనార్హం. ముంబయికి వెళ్లే విమానాల్లో రూ.20వేలకుపైగా వసూలు చేస్తున్నాయి. సోమవారం కనీసం రూ.21,974 వసూలు చేశాయి. అదే విధంగా కోల్‌కతా, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు నడిచే విమానాల్లోనూ టికెట్ల ధరలు ఇదే తరహాలో వసూలు చేస్తోన్నాయి.

"అధిక డిమాండ్ వల్ల ప్రయాగ్‌రాజ్ విమాన ఛార్జీలు పెరిగాయి. సాధారణంగా విమానయాన సంస్థలు ట్రావెల్ ఏజెంట్ల ద్వారా ముందస్తు బుకింగ్‌లకు ప్రత్యేక విమాన ఛార్జీలు లేదా తగ్గింపులను అందిస్తాయి. కానీ ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విమాన కంపెనీలే స్వయంగా విక్రయించుకుంటున్నాయి. సాధారణంగా రూ.8,000 నుంచి రూ.10,000 మధ్య ఉండే ఛార్జీ ఇప్పుడు ప్రయాణ తేదీని బట్టి రూ.20,000 నుంచి రూ.25,000 వరకు పలుకుతోంది." అని ట్రావెల్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (గుజరాత్) ప్రెసిడెంట్ రోనక్ షా పేర్కొన్నారు. అధిక ఛార్జీలపై ఫిర్యాదులు పెరగడంతో రెండు వారాల క్రితం విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించింది. ఛార్జీలను తగ్గించాలని ఆయా కంపెనీలకు సూచించింది. విమానయాన కంపెనీలు మొక్కుబడిగా కొంత తగ్గించాయి. తిరిగి మళ్లీ చార్జీలను ఆకాశానికి చేర్చడం పట్ల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఎమ్‌డిగా అనురాగ్ మెహ్రోత్ర



న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా అనురాగ్ మెహ్రోత్రాను నియమించుకుంది. ఇంతక్రితం ఆయన ఫోర్డ్ ఇండియా ఎమ్‌డిగా పని చేశారు.

ఎన్‌టిపిసి అదనపు డివిడెండ్ రూ.2,424 కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ దిగ్గజ విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టిపిసి తమ వాటాదారులకు మరో బంఫర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను అదనంగా మరో రూ.2,424 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను అందించడానికి నిర్ణయం తీసుకుంది. ఇంతక్రితం తొలి మధ్యంతర డివిడెండ్ కింద నవంబర్ 2024లోనూ రూ.2,424 కోట్లు చెల్లించింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.8,000 కోట్ల మొత్తం డివిడెండ్‌ను చెల్లించినట్లు కానుందని ఆ సంస్థ పేర్కొంది. 2023-24కు సంబంధించిన రూ.3,152 కోట్ల డివిడెండ్‌ను సెప్టెంబర్ 2024లో చెల్లించినట్లు గుర్తు చేసింది.

శివరాత్రి ఉత్సవాలకు శ్రీశైలం సిద్ధం

- ఏడు క్యూలైన్ల ఏర్పాటు
- డ్రోన్లతో ప్రత్యేక నిఘా
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీశైలం ఆలయం సిద్ధమైంది. బుధవారం నుంచి మార్చి 1వ తేదీ వరకూ బ్రహోత్సవాలను నిర్వహించనున్నారు. గతేడాదికంటే 30 శాతం యాత్రికులు పెరుగుతారనే అంచనాతో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యాధునిక పద్ధతుల్లో ఆరు డ్రోన్ల ద్వారా కమాండ్ కంట్రోల్ నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మొత్తం ఏడు క్యూలైన్లను సిద్ధం చేశారు. అందులో వృద్ధులకు, వికలాంగులకు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివస్వాములకు చంద్రావతి కల్యాణ మండపం నుంచి నేరుగా ఆలయంలోకి వెళ్లేందుకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. యాత్రికులు స్నానాలు ఆచరించేందుకు పాతాళగంగతోపాటు భవానీ ఘాట్ వద్ద ఏర్పాట్లు చేశారు. శివరాత్రి రోజు తెల్లవారుజామున 2 గంటల నుంచి ఎలాంటి బ్రేక్ లేకుండా స్వామి, అమ్మవార్లను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు. లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలను 22 నుంచి 29 వరకు పెంచారు. శానిటేషన్ పర్యవేక్షణకు వెయ్యి మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. దేవస్థానం నుంచి 200 మంది సిబ్బంది, 1200 మంది కార్మికులు పని చేయనున్నారు. శివస్వాములకు ఈ నెల 19 నుంచి 23 వరకు స్పర్శ దర్శనం కల్పించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం నాలుగు వేదికలు, యాత్రికులు సేదతీరేందుకు గంగాధర మండపం నుండి నంది మండపం వరకు ఇరువైపులా చలువు పందిళ్లు ఏర్పాటు చేశారు.



స్వాగత ద్వారం

స్థానిక పిహెచ్‌సి వైద్యశాలలో వైద్య సేవలందించనున్నారు. శ్రీశైలం చుట్టూ దాదాపు ఆరు కిలోమీటర్ల వరకు రెండు వరసలుగల వలయం (రింగ్‌రోడ్డు)లో వాహనాలు నిలిపేందుకు అవకాశం కల్పించారు. గణేష్ సదన్ ఎదురుగా ఎపిఎస్‌ఆర్‌టిసి, తెలంగాణ ఆర్‌టిసి, కర్ణాటక ఆర్‌టిసి బస్సు స్టాప్లను ఏర్పాటు చేశారు. ఈ పార్కింగ్ ప్రాంతాల కోసం దాదాపు 13.80 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాలకు బందోబస్తు పర్యవేక్షణకు 581 సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. అన్నపూర్ణ భవన్ వద్ద ఉన్న దేవస్థానం సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్ రూం ఆధునీకరించారు. 21 ఎల్ఇడి స్క్రీన్‌ల ద్వారా అన్ని సిసి కెమెరాల దృశ్యాలను వీక్షించే ఏర్పాట్లు చేశారు. శిఖరేశ్వరం, ముఖద్వారం, కైలాస ద్వారం, అటకేశ్వరం, సాక్షి గణపతితో పాటు పాతాళగంగా స్నాన ఘాట్ల వరకు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా చెత్త నిర్వహణ యూనిట్లు

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా చెత్త నిర్వహణ ప్లాంట్లను ఏర్పాటుచేసి అన్నిచోట్లా ప్రాసెసింగ్ ప్రక్రియ మొదలుపెడతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, దీనికి కందుకూరు నుండి సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. 123 మున్సిపాలిటీల నుండి ప్రతిరోజూ 6,900 టన్నుల చెత్త వస్తుందని, అందులో ప్రస్తుతం 49 శాతం మాత్రమే ప్రాసెస్ చేస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో అన్నిచోట్ల వేస్టటు ఎనర్జీ ప్లాంట్లు పెడతామన్నారు. ఈ నెలాఖరుకు 300 గ్రామాలను ఓడిఎఫ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 90 శాఖలకు చెందిన 2.17 లక్షల మంది ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారని వివరించారు.

రైల్వే జోన్ కార్యాలయ ప్రతిపాదిత ప్రాంతంలో భూసార పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక భాగంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు కేటాయించిన స్థలంలో మంగళవారం భూసార పరీక్షలు నిర్వహించారు. ఇటీవల టిడిపి కూటమి ప్రభుత్వం ముడసర్లోవ ప్రాంతంలో రైల్వే జోన్ ప్రధాన కార్యాలయంతో పాటు వాటి అనుబంధ కార్యాలయాల కోసం 52 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో కార్యాలయాలు నిర్మించే ముందు జెజె అసోసియేట్స్ ఆధ్వర్యంలో భూసార పరీక్షల ప్రక్రియను ప్రారంభించింది.


స్మృత్యంజలి పార్కు వద్ద ఉక్కు అమరవీరులకు నివాళ్లర్పిస్తున్న పోరాట కమిటీ నాయకులు

స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకింత వివక్షత?

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయన్నారు. పూర్తిస్థాయి సిఎమ్‌డి, డైరెక్టర్లు లేని సందర్భంలో కూడా ఉత్సవాలు అనేకసార్లు జరిగాయని, ఇప్పుడున్న ఉన్నతాధికారులు ఆ దిశగా నిర్ణయాలు చేయకపోవడం దారుణమని అన్నారు. ఆవిర్భావ దినోత్సవం జరపకపోవడంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. తొలుత ఉక్కు కార్మికులకు, వారి కుటుంబాలకు పోరాట కమిటీ నాయకులు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, పివి.రమణమూర్తి, కారు రమణ, శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్ కుమార్, వైటి.దాస్, దొమ్మేట అప్పారావు, నడుపూరు వెంకన్న, బి.అప్పారావు పాల్గొన్నారు.

భారత్, ఖతార్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇంతవరకు తన వైఖరి వెల్లడించలేదు. ట్రంప్ కొత్త ప్రతిపాదన పాలస్తీనా జాతి ప్రక్షాళనకు ఉద్దేశించబడిందేనంటూ సర్వత్రా విమర్శలు, ఖండనలు వెల్లువెత్తుతున్న తరుణంలో భారత విదేశాంగ శాఖ కూడా దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తోంది.

భారత నావికాదళానికి చెందిన మాజీ కమాండర్ పూర్ణేంద్రు తివారీ ఇంకా ఖతార్ అదుపులోనే వుండడంపై కూడా ఇరు పక్షాలు చర్చించాయి. ఇదే కేసులోని మిగిలిన ఏడుగురు ఖైదీలను గతేడాది ఫిబ్రవరిలోనే స్వదేశానికి పంపించిన నేపథ్యంలో తివారీ విడుదల ఇంకా స్థానిక కోర్టుల్లో నలుగుతునే వుంది. ఖతార్‌లో భారతీయులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారని, దాదాపు 600మంది భారతీయులు ఖతార్ జైళ్ళలో మగ్గుతున్నారని ఛటర్జీ తెలిపారు. వీరిలో 85మంది భారతీయులకు గతేడాది క్షమాభిక్ష దొరికిందన్నారు.

వంశీకి జగన్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లారు. వంశీని పరామర్శించి బయటకు వచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజాస్వామ్య విలువలను కూటమి పాలకులు దిగజారుస్తున్నారని అన్నారు. గన్నవరంలో టిడిపి కార్యాలయంపై దాడి సమయంలో వంశీ అక్కడ లేకపోయినా కేసు నమోదు చేశారని తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన సత్యవర్ధన్ కేసు వెనక్కు తీసుకున్నారని, దీన్ని సహించలేని పోలీసులు, ప్రభుత్వం అతన్ని కిడ్నాప్ చేశారంటూ మరో కేసు నమోదు చేసి వంశీని అరెస్టు చేశారని తెలిపారు. గన్నవరంలో టిడిపి అధికార ప్రతినిధి పట్టాభి రెచ్చగొట్టడం వల్లే ఘర్షణ జరిగిందని చెప్పారు. తమకు నచ్చనివారిపై దొంగ సాక్ష్యాలు సృష్టించి, దొంగ కేసులు పెట్టి నెలల తరబడి జైల్లో పెడుతున్నారని, దీనికి వంశీ కేసే నిదర్శనమని అన్నారు.

సభ్యులు లేకపోయినా గెలుస్తున్నారు

ప్రజాస్వామ్యం అంటే రాష్ట్రంలో కూటమి పాలకులకు గౌరవం లేదని, 33 మంది కౌన్సిలర్లు ఉన్న పిడుగురాళ్లలో టిడిపి తరుపున వైస్‌ఛైర్మన్ ఎలా గెలిశారో అర్థం కావడం లేదని అన్నారు. తిరుపతిలోనూ అంతేనని, ఒక్క సభ్యుడున్న టిడిపి డిప్యూటీ మేయర్‌ను గెలవడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. తుని, పాలకొండలోనూ అదే జరుగుతోందని అన్నారు.

నిందితులకు వేగవంతమైన విచారణ కోరే హక్కు

- అది ఆలస్యమైతే బెయిల్ పొందవచ్చు
- ఛత్తీస్‌గఢ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ : నేరం ఎంత తీవ్రమైనదైనప్పటికీ విచారణను వేగవంతం చేయాలని కోరే ప్రాథమిక హక్కు నిందితులకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విచారణ చేయకుండా, తీర్పు చెప్పకుండా అండర్ ట్రయల్ ఖైదీని ఆరేడు సంవత్సరాలు జైలులో ఉంచడం అతని ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమే అవుతుందని, అలాంటి సందర్భంలో బెయిల్ మంజూరు చేయవచ్చునని స్పష్టం చేసింది. ఉగ్రవాద నిరోధక చట్టం కింద అరెస్టయి గత ఐదు సంవత్సరాలుగా కస్టడీలోనే ఉన్న నిందితుడిని బెయిల్‌పై విడుదల చేసింది. విచారణ సమయంలో సాక్షులను పెద్ద సంఖ్యలో ప్రశ్నించే ప్రాసిక్యూషన్ సంస్థల ధోరణిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇది విచారణలో జాప్యానికి కారణమవుతోందని తెలిపింది. విచారణలో జాప్యం, బెయిల్ వంటి అంశాలను పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందని అంటూ సుదీర్ఘకాలం నిర్బంధంలో గడిపిన తర్వాత నిర్దోషిగా విడుదలైతే కనీసం ఆర్థికంగా పరిహారం కూడా పొందలేకపోతున్నారని జస్టిస్ జెబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన బెంచ్ తెలిపింది. నిందితులు సుదీర్ఘ కాలం పాటు విచారణను ఎదుర్కొంటే ఒత్తిడికి గురవుతారని చెప్పింది. 'చాలా కాలం నిర్బంధంలో ఉండి నిర్దోషిగా బయటపడే వారికి ఆర్థికంగా పరిహారం కూడా లభించడం లేదు. వారు ఉద్యోగాన్నో వసతినో కోల్పోవచ్చు' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. నక్సల్స్ కార్యకలాపాల్లో వినియోగించే వాకీటాకీలు, లెడ్ లెన్సులు వంటి వస్తువులను తీసుకొని వెళుతుండగా నిందితుడిని ఛత్తీస్‌గఢ్‌లో 2020 మార్చిలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వంద మంది సాక్షులను విచారించాలని భావించింది. కానీ ఐదు సంవత్సరాల్లో కేవలం 42 మందిని మాత్రమే విచారించింది.

22న ఆరుగురు బందీల విడుదల : హమాస్

దుబాయ్, కైరో : ఈ నెల 22న మరో ఆరుగు ఇజ్రాయిల్ బందీలను విడుదల చేస్తామని హమాస్ నేత ఒకరు మంగళవారం తెలిపారు. అలాగే నలుగురు బందీల మృతదేహాలను కూడా ఈ నెల 20న అప్పగిస్తామని చెప్పారు. విడుదలయ్యే ఆ ఆరుగురిలో గాజాలో అదుపులోకి తీసుకున్న ఇద్దరు కూడా వుంటారని తెలిపారు. ఇక ఆ మృతదేహాలు బీబాస్ కుటుంబానికి చెందినవని హమాస్ నేత ఖలీల్ అల్ హయా టెలివిజన్‌లో ప్రసంగిస్తూ చెప్పారు. మొదటి దశ కాల్పుల విరమణలో భాగంగా విడుదలవనున్న వారిలో పై ఆరుగురే చివరి సజీవ బందీలు కానున్నారు. ఈ విషయాన్ని నెతన్యాహు కార్యాలయం కూడా ధృవీకరించింది. గురువారం నాలుగు మృతదేహాలను అందుకోగా మరో వారం రోజుల తర్వాత మరోనాలుగు మృతదేహాలను అందకుంటారని నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

కాగా రెండో దశ కాల్పుల విరమణపై ఇంకా ఉభయ పక్షాలు చర్చలు జరపాల్సి వుంది. ఇది క్లిష్టతరమైన దశ అని భావిస్తున్నారు. శాశ్వతమైన కాల్పుల విరమణకు, ఇజ్రాయిల్ బలగాల ఉపసంహరణకు ప్రతిగా మరిన్ని డజన్ల సంఖ్యలో బందీలను హమాస్ విడుదల చేయాల్సి వుంది. గాజాలో ఇప్పటివరకు మరణించినవారి సంఖ్య 48,291 కాగా, 1,11,722 గాయపడ్డారు.

సంపాదకీయం

'కుంభమేళా' నేరాలు

కుంభమేళా జరుగుతున్న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరిన యాత్రికులు ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి తొక్కిసలాటలో 18 మంది మరణించడం దిగ్భ్రాంతి కలిగించే విషయం. చనిపోయిన వారిలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉండటం కలిచివేస్తుంది. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఇంకా కొందరి పరిస్థితి విషమంగానే ఉందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. తొక్కిసలాటపై ప్రభుత్వం ఇద్దరు అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. విచారణ ప్రారంభించిన సదరు కమిటీ అప్పుడే కేంద్ర ప్రభుత్వం, రైల్వేశాఖ వైఫల్యాలను కప్పెట్టేందుకు నానా తంటాలూ పడుతోంది. ప్లాట్‌ఫారాలకు ఒకే పేరు కలిగిన రైళ్లు వస్తాయని రైల్వేస్టేషన్‌లో చేసిన అనౌన్స్‌మెంట్, అప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాల్సిన మూడు రైళ్లు ఆలస్యం కావడం, ప్రయాణీకుల అనూహ్య రద్దీ, ఇరుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి... ఏవేవో కారణాలను లీకుల రూపంలో వండి వారుస్తోంది. ఉన్నత స్థాయి కమిటీ నివేదిక పూర్తి స్థాయిలో తయారు కాకుండానే నిర్ధారణలకు రావడం బట్టి చివరికి ఏమవుతుందో ఊహించడం పెద్ద కష్టమేం కాదు. గతంలో పలు రైలు ప్రమాదాల విచారణలకు ఏ గతి పట్టించారో ఇదీ అంతేనని అర్థమవుతుంది. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాలు, ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వంలోని పలువురి సంతాపాలు కంటి తుడుపు చర్యలుగానే కనిపిస్తాయి.

త్రివేణి సంగమంలో నెల రోజుల పాటు యుపి బిజెపి ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన మహా కుంభమేళాలో, ఆ పేరిట జరిగిన వరుస ప్రమాదాల్లో ఎంత మంది అశువులు బాసారో లెక్కలేదు. గత నెల 29న మౌని అమావాస్య నాడు లక్షలాది మంది ప్రయాగ్‌రాజ్ చేరడంతో పెద్ద ఎత్తున తొక్కిసలాట జరగ్గా 30 మంది చనిపోయారని, 60 మంది వరకు గాయపడ్డారని యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. అంతకు కొన్ని రెట్ల మంది మరణించారని, క్షతగాత్రులయ్యారని ప్రతిపక్షాలు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కరోనా సమయంలో గంగానదిలో కొట్టుకొచ్చిన మృతదేహాలను గుర్తుకు తెచ్చుకుంటే ప్రతిపక్షాల విమర్శలను కొట్టిపారేయలేం. ప్రయాగ్‌రాజ్‌లో ఇప్పటి వరకు ఏడు అగ్ని ప్రమాదాలు సంభవించాయన్నది ఒక లెక్క. యావత్ దేశాన్నీ నివ్వెరపాటుకు గురిచేసిన మౌని అమావాస్య రోజు నాటి తొక్కిసలాటకూ ఒక చోట అగ్ని రాజుకోవడమే హేతువని తెలుస్తోంది. ఇంతటి ఘోర ఉదంతాలను అటు మోడీ సర్కారు ఇటు యోగి సర్కారు లైట్ తీసుకుంటున్నాయనడానికి వరుస ఘటనలే నిదర్శనాలు.

కుంభమేళాకు కేంద్ర ప్రభుత్వం, యోగి సర్కారు కల్పించిన ప్రచారానికి ఆకాశమే హద్దు. మీడియాలో వందల కోట్ల రూపాయల అడ్వర్టయిజ్‌మెంట్లు ఒక ఎత్తు కాగా, ప్రధాన స్రవంతి మీడియాకు అదే పని పెట్టడం మరో ఎత్తు. కుంభమేళాకు వెళ్లకపోతే మానవ జీవితం దండగన్న స్థాయికి ఫోబియాను ప్రజల్లో కల్పించారు. గోడీ మీడియాతో పాటు సంఘ్‌పరివారం సైతం రెచ్చిపోయింది. కుంభమేళాకు ఏడు వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని యోగి సర్కారు ప్రకటించింది కూడా. 40 కోట్ల మంది వస్తారని అంచనా వేసి అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశామంది. కాని అవి ఎంత డొల్లగా ఉన్నాయో దుర్ఘటనలు విదితం చేస్తున్నాయి. కుంభమేళాతో రెండు మూడు లక్షల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఊహించినదానికంటే ఇప్పటికే 50 కోట్ల జనం దాటారంటున్నారు. ఇంత మంది పాల్గొంటారని తెలిసి కూడా తగిన ముందస్తు భద్రతా, రక్షణ చర్యలు చేపట్టకపోవడం మోడీ, యోగి ప్రభుత్వాల దారుణ నిర్లక్ష్యానికి పరాకాష్ట. యాత్రికుల ప్రాణాలంటే లెక్కలేనితనం. వరుస తొక్కిసలాటలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రమాదకర స్థాయికి చేరిన నీటి, గాలి కాలుష్యం చూస్తుంటే ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి లవలేశమాత్రం కేంద్రం, యుపి ప్రభుత్వం బాధ్యతపడలేదని స్పష్టమవుతుంది. ఇవన్నీ కేంద్రం, యోగి ప్రభుత్వ నేరాలుగా పరిగణించాల్సి ఉంటుంది. పలువురు యాత్రికుల ప్రాణాలను హరించిన, ఆస్పత్రుల పాల్జేసిన కుంభమేళా సంబంధ అన్ని దుర్ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను నిర్ధారించి శిక్షిస్తేనే భవిష్యత్తులో యాత్రికులకు కాస్తంత భరోసా సిద్ధిస్తుంది. ఢిల్లీ తొక్కిసలాటకు బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలన్న డిమాండ్ ధర్మ సమ్మతమే!


మంచి మాట



మనం ప్రతిరోజూ పోరాటం చేస్తూ ఉంటేనే మానవీయత పట్ల మనకున్న ప్రేమ వాస్తవ రూపం దాల్చుతుంది.
- చే గువేరా

విశ్లేషణ

పెద్దల సభకు పెద్దరికంగా ...



> **పెద్దల సభకు ఎన్నికయ్యే ఈ పది మంది సభ్యులపైన ఒక గురుతర బాధ్యతను రాజ్యాంగం ఏర్పాటు చేసింది. అదేమిటంటే ఎంత మంచి ప్రభుత్వమైనా నిర్ణయాలను చేస్తున్నప్పుడు తన రాజకీయ ప్రయోజనాలను కూడా చూసుకుంటూ ఉంటుంది. అందువల్ల సహజంగానే తప్పు నిర్ణయాలు చేయడానికి కూడా అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాలలో పెద్దల సభ జోక్యం చేసుకొని అటువంటి నిర్ణయాలను మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ఎన్నికైన సభ్యులు సహజంగానే ఈ పని చేయలేరు. అందువల్ల ఈ పెద్దల సభకు ఎన్నికయ్యేవారు రాజకీయాలకు అతీతంగా, ప్రజల పక్షాన నికరంగా నిలబడి, ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను ప్రశ్నించి, సరిచేయగలిగే స్థాయి కలిగి ఉండాలి. అటువంటి తెగువ, దార్శనికత ప్రదర్శించేవారు ఈ సభకు ఎన్నికైతే అది పెద్దల సభకు గౌరవం దక్కించినట్లు లెక్క.**

ఈ నెల 27వ తేదీన రాష్ట్రంలోని మూడు శాసనమండలి స్థానాలకు–కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గం, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం, ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గానికి ఎన్నికలు జరుగుతున్నాయి.

సాధారణ ఎన్నికల వలె గాక ఈ ఎన్నికలకు ఓ ప్రత్యేకమైన నేపథ్యం ఉంది. శాసనమండలిని పెద్దల సభ అని కూడా పిలుస్తారు. రాజ్యాంగం లోని నిబంధన ప్రకారం ఆ యా రాష్ట్రాల శాసనసభల ఆమోదం పొందితే ఏ రాష్ట్రంలోనైనా రాష్ట్రపతి అనుమతితో శాసనమండలిని ఏర్పాటు చేయవచ్చు. ఆ రకంగా మన రాష్ట్రంలో శాసనమండలి ఏర్పాటయింది. దీనిని 1985లో నాటి ఎన్.టి.రామారావు ప్రభుత్వం రద్దు చేసింది. మరలా వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వం 2007లో శాసన మండలిని పునరుద్ధరించింది. అప్పటి నుండి నేటి వరకు రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా శాసన మండలి కొనసాగుతోంది.



ఎ. అజ శర్మ

పెద్దల సభ ఏర్పాటుపై రాజ్యాంగ పరిషత్‌లో పెద్ద చర్చే జరిగింది. ఇది అవసరమా, అనవసరమా అనే రెండు కోణాల నుంచి పరిశీలన జరిపిన పిదప డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సూచన మేరకు దీని ఏర్పాటుకు రాజ్యాంగంలో అవకాశం కల్పించబడింది.

శాసనమండలిలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గం సభ్యులతో పాటు, ఎమ్మెల్యేల చేత ఎన్నుకోబడిన సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులచే ఎన్నుకోబడిన సభ్యులు, గవర్నర్ నామినేట్ చేసిన సభ్యులు వంటి వారు కూడా ఉంటారు.

అయితే శాసన మండలిలో పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానాలు కేటాయించడంలో అర్థం, పరమార్థం ఉన్నాయి. మన రాష్ట్రంలో మొత్తం శాసనమండలి 58 స్థానాలలో ఐదు స్థానాలు పట్టభద్రుల నియోజక వర్గాలకు, మరో ఐదు స్థానాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కేటాయించబడ్డాయి. పెద్దల సభకు ఎన్నికయ్యే ఈ పది మంది సభ్యులపైన ఒక గురుతర బాధ్యతను రాజ్యాంగం ఏర్పాటు చేసింది. అదేమిటంటే ఎంత మంచి ప్రభుత్వమైనా నిర్ణయాలను చేస్తున్నప్పుడు తన రాజకీయ ప్రయోజనాలను కూడా చూసుకుంటూ ఉంటుంది. అందువల్ల సహజంగానే తప్పు నిర్ణయాలు చేయడానికి కూడా అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాలలో పెద్దల సభ జోక్యం చేసుకొని అటువంటి నిర్ణయాలను మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ఎన్నికైన సభ్యులు సహజంగానే ఈ పని చేయలేరు. అందువల్ల ఈ పెద్దల సభకు ఎన్నికయ్యేవారు రాజకీయాలకు అతీతంగా, ప్రజల పక్షాన నికరంగా నిలబడి, ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను ప్రశ్నించి, సరిచేయగలిగే స్థాయి కలిగి ఉండాలి. అటువంటి తెగువ, దార్శనికత ప్రదర్శించేవారు ఈ సభకు ఎన్నికైతే అది పెద్దల సభకు గౌరవం దక్కించినట్లు లెక్క.

అయితే ఇటువంటి సభను కూడా పునరావాస కేంద్రంగా మార్చేసిన పాలకులు, పెద్దల సభను రాజకీయ సభగా మార్చేస్తున్నారు. కాంట్రాక్టర్లను, బడా వ్యాపారస్తులను, పోటీలకు పెట్టి, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, ఎలాగైనా గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నారు తప్ప ఈ పెద్దల సభకు తగ్గ హుందాతనం ప్రదర్శించడం లేదు.

ఉదాహరణకు నేడు కృష్ణ, గుంటూరు జిల్లాలకు జరుగుతున్న ఎన్నికలలో అధికార కూటమి అభ్యర్థి కోటీశ్వరుడైన బడా పారిశ్రామికవేత్తపై ప్రముఖ విద్యావేత్త, మేధావి కె.ఎస్.లక్ష్మణరావు తలపడుతున్నారు. గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానానికి తెలుగుదేశం బలపరిచిన అభ్యర్థి వ్యాపారవేత్త, కోటీశ్వరుడితో ప్రజా ఉద్యమ నాయకులు డి.వి.రాఘవులు పోటీ పడుతున్నారు. అలాగే ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి తెలుగుదేశం మద్దతుతో ప్రస్తుత ఎమ్మెల్సీ, బిజెపి మద్దతుతో ఒక మాజీ ఎమ్మెల్సీ పోటీ చేస్తుండగా, వారిద్దరితో ఉపాధ్యాయ ఉద్యమ నేత కోరెడ్ల విజయగౌరి తలపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ అభ్యర్థులలో ఎవరిని గెలిపించుకుంటే పెద్దల సభకు గౌరవం దక్కుతుంది? ఏ ప్రజా సమస్యలు ఈ పెద్దల సభలో చర్చకు వస్తాయి? ఎవరు ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలపై గళమెత్తుతారన్నది పట్టభద్రులు, ఉపాధ్యాయులు విజ్ఞతతో ఆలోచించి, ఓటు వేయవలసిన రాజ్యాంగబద్ధ బాధ్యత ఉంది. దానికి భిన్నంగా ఇక్కడ కూడా కులం, డబ్బు, గిఫ్టులు వంటి ప్రలోభాలకు గురి చేయాలని శత విధాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటికి లోనైతే విద్యావంతుల కోవలోనికి వస్తామా అన్నది ఒకసారి ఎవరికివారే ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ప్రతిపక్షం శాసన సభకు వెళ్ళడం మానేసింది. ఇక సభలో అంతా అధికార పక్షమే. ప్రజా సమస్యలు చర్చకే రావు. నేడు ఈ మూడు స్థానాలలోనూ అధికార పార్టీ అభ్యర్థులు గెలవకపోయినా ప్రభుత్వ మనుగడకు వచ్చే ఢోకా ఏమీ లేదు. కానీ, ఈ మూడు స్థానాలలో సామాన్యుల పక్షాన నికరంగా నిలిచే అభ్యర్థులు గెలవకపోతే, ఇక పట్టభద్రుల, ఉపాధ్యాయుల, ప్రజల వాణి చట్ట సభల్లో వినపడనే వినపడదు.

2007లో శాసన మండలిని రాష్ట్రంలో పునరుద్ధరించిన తరువాత స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి, గెలిచిన ఎమ్మెల్సీలు కలసి, పెద్దల సభలో రాజ్యాంగ బాధ్యతకనుగుణంగా వ్యవహరించేలా ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పి.డి.ఎఫ్) వేదికను ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు గెలిచిన 14 మంది పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీలు నిబద్ధతతో చట్టసభ లోపల, బయట ప్రజా పక్షం వహించారు, వహిస్తున్నారు. సమాజాభివృద్ధికి సహకరించేలా విద్యా వ్యవస్థ బలోపేతం, ఉపాధి కల్పన వంటి ప్రధాన లక్ష్యాలతో కృషి చేస్తున్నారు. నేడు ఈ మూడు స్థానాలలోనూ పి.డి.ఎఫ్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

పాఠశాలలను కుదించేలా చేసిన 117 జీవో రద్దు కోసం కృషి చేసింది పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీలే. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేసి, దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యమిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని ఖండించి, వారికి అండగా నిలిచింది పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీలే. ఉద్యోగుల కరువు భత్యం, ఖాళీ పోస్టుల భర్తీ, పీఆర్సీ ఛైర్మన్ నియామకం వంటి అనేక అంశాలలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షం వహించి, ప్రభుత్వ తీరును ఎండగట్టింది పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీలే. అక్షరాస్యతలో అధ్వానంగా ఉన్న గిరిజన ప్రాంతంలో వారివారి గిరిజన భాషల్లో చదువు చెప్పే భాషా వాలంటీర్లను తొలగించాలని గత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. గిరిజన ప్రాంతంలో జీవో నెంబరు 3కు చట్టబద్ధత కల్పించకుండా గిరిజనులకు హాని చేసింది. వీటితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలపై అత్యాచారాలు వంటి అనేక సమస్యలపై చట్టసభలో చర్చకు పెట్టి, వాటిపై పట్టుబట్టిన చరిత్ర పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీలకే ఉంది.

ప్రభుత్వ విద్య బలహీనపడడంతో నేడు ఆంధ్ర రాష్ట్రంలో పాఠశాల స్థాయిలో 50 శాతం మంది, ఉన్నత విద్యలో 80 శాతం విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలోనే విద్య పొందుతున్నారు. అటువంటి విద్యా సంస్థల సిబ్బంది బాధ్యత తనకేమీ లేనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. చిన్న యాజమాన్యాలను ఇబ్బంది పెడుతోంది.

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం–2020 పేరున విద్యా రంగాన్ని పూర్తిగా వ్యాపారమయం, కార్పొరేటీకరణ చేసింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోయింది. గత ప్రభుత్వం జీవో నెం.117 ద్వారా రేషనలైజేషన్ పేరున పాఠశాలల మూసివేతలు, విలీనాలు చేపట్టింది వుంది. ఇప్పటికే మిగిలిన అనేక చిన్న చిన్న దేశాలతో పోల్చినా మన దేశంలో ఘోరంగా అక్షరాస్యత 77 శాతం మాత్రమే. అందులోనూ అక్షరాస్యతలో ఆంధ్ర రాష్ట్రం 66 శాతంతో 32వ స్థానంతో అడుగున ఉంది. అలాంటి సమయంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలంటే ప్రభుత్వ విద్య బలోపేతం కావలసిన అవసరం ఉండగా, విచిత్రంగా మన పాలకులు దానిని మరింత బలహీనపరిచే విధానాలు అవలంభిస్తున్నారు. విద్యాహక్కు చట్టాన్ని కాగితాలకే పరిమితం చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోంది. జీవో 117ను నామమాత్రంగా రద్దు చేసి, అందులోని అంశాలను మాత్రం యథాతథంగా అమలు చేస్తూనే ఉన్నారు. అనేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెగా డిఎస్సీ నిర్వహణ అనే హామీ నేటికీ ఆచరణ రూపం దాల్చలేదు. శాశ్వత నియామకాలు చేపట్టకుండా, ఉపాధ్యాయ, అధ్యాపకులను కూడా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ వంటి వివిధ పేర్లతో నియమిస్తూ, ఎటువంటి ఉద్యోగ భద్రత లేని, తక్కువ వేతనాలతో గొడ్డు చాకిరీ చేయించుకుంటూ ప్రభుత్వం ఆ వృత్తికే కళంకం తెస్తోంది. ఏ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినా, పోటీ పడి ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తున్న స్థితి నేడు రాష్ట్రంలో నెలకొంది.

మన దేశంలో పౌరులందరికి ఒకే ఓటు ఉంది. అయితే పట్టభద్రులకు మాత్రం దానితో పాటు మరో ఓటు, అంటే రెండు ఓట్లు వేసే హక్కు ఉంది. ఉపాధ్యాయులకు ఆ రెండిటితో పాటు, ఉపాధ్యాయ ఓటు ద్వారా మూడో ఓటు కూడా వేసే హక్కు రాజ్యాంగం కల్పించి, వారిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెట్టింది. ఆ రాజ్యాంగబద్ధ నమ్మకానికి తగ్గట్లుగా విద్యావంతులయిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, పెద్దల సభకు అసలైన పెద్దలనే పంపే చైతన్యం ప్రదర్శిస్తారని ఆశిద్దాం.

/ వ్యాసకర్త ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి /

కవిత్వం

ఉడకని బియ్యం

గ్యాస్ కట్టేసింది
కట్టె కనుమరుగైంది
కరెంటును రెంటుకు తీసుకున్నా
కుక్కర్‌కు వైరు తగిలించినా
అదిగో బల్బు వెలిగించి
నా మొహంలో ఆనందం
వెయ్యి ఓల్ట్‌ల విద్యుత్ దీపమై
ప్రకాశించింది.
కుక్కర్‌లో ఎసరు మరుగుతోంది
కడుపులో ఆకలి గోల ఎక్కువైంది
కరెంటు ఉన్నపళంగా పోయింది
నిరాశ నాలో కమ్ముకుపోయింది
అన్నం ఉడకలేక ఉడుకుతోంది
ఎసురు మరగలేక మరుగుతోంది.
మళ్లీ కరెంట్ కట్
ఆకలి పేగు తెగినంత బాధైంది
పొంగుకొచ్చిన ఎసరు
సద్దుమణిగి కూర్చునేసింది
చూపులన్నీ కరెంటు బల్బుపైనే.
చివరికి అన్నం ఉడకలేదు
కరెంటు సమయానికి రాలేదు
మాడిన కడుపుతో
నానిపోయిన బియ్యం
దొడ్లో చాప పైన ఆరబోసుకున్నాను.
చేతిలో చిల్లిగవ్వ లేదు
అన్నం మెతుకులు ఉడకనేలేదు
కరెంటు బిల్లు
గద్దలా వాలిపోయింది ముంగిట్లో
బిల్లు వైపు
ఉడకని అన్నం వైపు
కామ్‌గా వేలాడుతున్న బల్బు వైపు
ఖాళీగున్న నా పొట్ట వైపు
ఒకసారి తేరిపార చూసుకున్నాను.
గట్టిగా పగలబడి నవ్వేసి
వంద రూపాయల నోటు వైపు చూసి
బిగ్గరగా ఏడ్చేశాను.
వెంటనే కరెంటు వచ్చింది
ఆ వెల్తురులో
ఉడకని బియ్యం మెరిసిపోతోంది
నిండని కడుపులో చీకటి పడింది
సగటు జీవితమంటే అంతే మరి.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

వ్యాఖ్య

కొత్త మందులు డబ్బున్న వారికే...

- ఎస్. కృష్ణస్వామి



> **వివిధ రూపాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ మందులు గుండెపోటుకు, పక్షవాతానికి, మూత్రపిండాల జబ్బులకు కూడా పని చేస్తాయని క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. కొన్ని రకాల జి.ఎల్.పి 1 మందులు అల్జీమర్స్, పార్కిన్‌సన్ వ్యాధులలో తోడ్పడతాయంటున్నారు. అలాగే డీఅడిక్షన్ వైద్యంలో కూడా. ఒక పక్కన ఈ మందులకు డిమాండ్లు పెరుగుతున్నా, అవి అందరికీ అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. ఈ మందులు వాడితే ఒక మనిషికి సంవత్సరానికి 8.6 లక్షల రూపాయల ఖర్చు వస్తుంది. అమెరికా జనాభాలో కూడా 1.7 శాతం మందికి మాత్రమే ఈ ప్రిస్క్రిప్షన్లు రాశారు. వీటికి, చాలా సందర్భాలలో ఇన్సూరెన్స్ లేదు. అంటే ఈ మందుల్ని చాలా కాలం స్థిరంగా వాడాలంటే, ఖర్చు రీత్యా వీలు కాకపోవచ్చు. జనరిక్ మందులుగా ఇవి ఉత్పత్తి అవుతాయనే ఆశలు ఉన్నాయి. కానీ మేధో సంపత్తి హక్కుల అడ్డు ఉంది.**

పెట్టుబడి, మార్కెట్లు చోదకంగా నడిచే అమెరికన్ ఆర్థిక వ్యవస్థపై, ఒక మందు చూపుతున్న ప్రభావం చాలా ఆసక్తికరంగా ఉంది. ఆ మందు పేరు ఓజెంపిక్. అలాగే, ఓజెంపిక్‌తో పోటీ పడుతున్న విగవి, మొంజారో లాంటి మందులు కూడా. ఇవి డయాబెటిస్‌కు, స్థూలకాయానికి వాడే మందులు. ఈ మందులు అమెరికన్ సంపన్న వర్గాల జీవనశైలులను, వినియోగ ధోరణులను కూడా మార్చేస్తున్నాయి. అమెరికన్ పరిశ్రమలను కూడా ప్రభావితం చేస్తున్నాయట. ఇది ఓజెంపిక్ ఎకానమీ అట. జి.ఎల్.పి 1 అగోనిస్టులు అనే రసాయన నామంతో పిలవబడే ఈ మందుల మార్కెట్ 2024లో నాలుగు లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని, 2032 కల్లా అది పదింతలు అవుతుందని లెక్కలు వేస్తున్నారు. ఇది వ్యక్తుల జీవితాలనే కాక, మొత్తం అమెరికన్ పరిశ్రమలన్నింటినీ ప్రభావితం చేస్తుందని ఒక అంచనా.

జి.ఎల్.పి 1 అంటే..

జి.ఎల్.పి 1 (గ్లూకగాన్ లైక్ పెప్టైడ్ 1, అనేది రసాయన నామం)ను 1980లో కనుగొన్నారు. ఇదొక హార్మోను. మానవ శరీరంలో, షుగర్‌ను నియంత్రించే మరో రెండు హార్మోన్లు– ఇన్సులిన్, గ్లూకగాన్–లపై జి.ఎల్.పి 1 ప్రభావం చూపుతుందని కనుగొన్నారు. అయితే ఈ జి.ఎల్.పి 1 హార్మోను శరీరంలో స్రవించిన వెనువెంటనే, చురుకుదనం కోల్పోవడం వల్లా, మందుగా ఉపయోగపడలేదు. చురుకుగా, స్థిరంగా కొంత కాలం పని చేయాలంటే, రసాయనికంగా వీటిలో కొన్ని మార్పులు చేర్పులు చేయాలి. అట్లా చేస్తే తయారైన మందులే జి.ఎల్.పి 1 అగోనిస్టులు. ఇవి షుగర్ వైద్యం మీద, ఒబెసిటీ వైద్యం మీద ఎంతగానో ప్రభావం చూపాయి. ఈ పరిశోధనా క్రమాలలో 2017లో, నోవా నాడేస్క్ కంపెనీ, సెమాగ్లుటైడ్ లేదా ఓజెంపిక్ అనే మందును ఆవిష్కరించింది. ఇలై లిల్లి అనే కంపెనీ కూడా ఇటువంటి మందులనే ఆవిష్కరించింది. వీటి క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొన్నవారు 16 నెలల సమయంలో, 17–22 శాతం బరువు తగ్గారు. ఈ మందులలో కొన్ని స్థూలకాయానికి వాడుకోవచ్చనే అనుమతులు 2023లో లభించాయి. జి.ఎల్.పి 1 లపై కొత్త పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కొత్త మందుల్ని కనుక్కుంటూనే ఉన్నారు. గిలా మాన్స్టర్ అనే పెద్ద బల్లి జాతిలో ఉండే విషంలోని ఒక ప్రోటీన్ ఆధారంగా ఒక మందును తయారు చేశారు. ఈ పరిశోధనలు చేసింది కూడా నోవా నా డెస్క్, ఇలై లిల్లి కంపెనీలే. ఇందులో పబ్లిక్‌ఫండ్స్ ద్వారా జరిగిన శాస్త్ర పరిశోధనల పాత్ర ఉంది . నాడీ మండల రక్షణకు, పార్కిన్‌సన్ లాంటి జబ్బులకు, అల్జీమర్స్‌కు, ఈ మందులు పనిచేస్తాయని ఈ పరిశోధనలు తేల్చాయి. శాస్త్రవేత్తల పట్టు విడువని కృషి, ముందు చూపు వల్ల వీటి ఆవిష్కరణ సాధ్యమైంది. ఫిజియాలజీలో, బయో కెమిస్ట్రీలో జరిగే దీర్ఘకాలిక పరిశోధనలు మందుల తయారీలో చాలా ప్రభావవంతంగా ఉంటున్నాయి. జి.ఎల్.పి1 పై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలకు అనేక అవార్డులు వచ్చాయి. 2017లో హెరింగ్టన్ అవార్డు, కెనడా గైర్డనర్ ఇంటర్నేషనల్ ప్రైజ్, 2023లో మణి ఎల్ బౌమిక్ పేరున ఉండే బ్రేక్ త్రూ అవార్డు (2.16 కోట్ల రూపాయలు) వచ్చాయి. మొదటి నుంచి చూస్తే ఈ పరిశోధనలలో–స్వెత్‌లానా మాజ్ సవ్, డేనియల్ డ్రకర్, జెన్స్ జుల్ హోల్స్ట్, లోటే జెరే నుడ్ సన్, రిచర్డ్ డి మార్చ్–లాంటి శాస్త్రవేత్తలు ముఖ్య పాత్ర వహించారు. అయితే వీరికి వచ్చిన గుర్తింపుల విషయంలో ఒక వివక్ష కూడా బయటపడింది.

మహిళా సైంటిస్టుపై వివక్ష...

1980లలో జి.ఎల్.పి1 పైన జరిగిన తొట్ట తొలి పరిశోధనలలో పాల్గొన్నది, స్వెత్‌లానా మాజ్ సవ్ అనే ప్రతిభావంతురాలైన యుగోస్లేవియన్ మహిళా శాస్త్రవేత్త. బెల్‌గ్రేడ్ యూనివర్సిటీలో, ఫిజికల్ కెమిస్ట్రీలో మాస్టర్స్, అమెరికాలోని రాక్ ఫెల్లర్ యూనివర్సిటీలో బయో కెమిస్ట్రీలో పి.హెచ్.డి చేయడానికి 1972లో ఆమె అమెరికాకు వచ్చింది. ఆ తర్వాత పెప్టైడ్ విశ్లేషణలపై ఆమె మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లో పరిశోధనలు చేసింది. అక్కడే క్రియాశీల జి.ఎల్.పి 1ను ఆమె కనుగొని నిర్ధారించింది. ఆమె ఆవిష్కరణల ఆధారంగానే, మొట్టమొదటి జి.ఎల్.పి 1 మందు తయారై, మార్కెట్లోకి వచ్చింది. అయితే ఆమె పోషించిన కీలక పాత్ర విస్మరణకు గురైంది. అవార్డులలో, పత్రికలలో ఈ పరిశోధనా ప్రస్తావనలు వచ్చినప్పుడు ఆమెను పక్కన పెట్టారు. సైన్సు అధికార పీఠాలలో బైఠాయించి ఉన్న వారికే, మామూలుగా గుర్తింపులు కూడా వస్తాయి. ముఖ్యంగా మగవారికి వస్తాయి. అంతగా ప్రాచుర్యంలో లేని వారు, ముఖ్యంగా మహిళా శాస్త్రవేత్తలు, ప్రతిభ ప్రదర్శించినా, గుర్తింపులకు నోచుకోరు. మాజ్ సవ్ తన గురించి తాను పది మందిలో ప్రచారం చేసుకొనేది కాదు. అయితే ఆమె అభిమానులు, స్నేహితులు ఆమె తరపున గొంతు విప్పారు. న్యూయార్క్ టైమ్స్ జి.ఎల్.పి 1 పై ప్రచురించిన ఒక వ్యాసంలో ఆమె ప్రస్తావన లేదు. నేచర్ పత్రిక, సెల్ పత్రిక (2021) లలో వచ్చిన వ్యాసాలలో కూడా ఆమె పేరు విస్మరణకు గురైంది. ఆమె మిత్రులు జోక్యం చూసుకుని, దీన్ని ఎత్తి చూపిన తరువాతే, ఆ యా పత్రికలన్నీ సవరణలు ప్రకటించాల్సి వచ్చింది. ఆమె పని చేసిన మసాచుసెట్స్, జి.ఎల్.పి పై పేటెంట్ హక్కులకు దరఖాస్తు చేసినప్పుడు, మాజ్ సవ్‌కు కనీస సమాచారం అయినా అందించలేదు. ఆవిష్కర్తగా, ఆమె పేరు జోడించకుండా, జోయల్ హబెనర్ అనే శాస్త్రవేత్త పేరును మాత్రమే పేటెంట్ పత్రాలలో పొందుపరిచింది. రెండేళ్ల తర్వాత పేటెంట్లు వచ్చాయి. అందులో ఆమె పేరును సమాన హోదాగల సహ ఆవిష్కర్తగా, న్యాయంగా జోడించడానికి ఆమె ఏళ్ల తరబడి న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. జి.ఎల్.పి అంశంలోనే, మరో రెండు కొత్త పేటెంట్లకు ఇదే సంస్థ అప్లై చేసుకున్నది. మళ్లీ మామూలే. మాజ్ సవ్ పేరు లేదు. చివరకు చాలా ఏళ్ల పోరాటం తర్వాత 2004లో, 2006లో ఆవిష్కర్తగా మాజ్ సవ్ పేరును రెండు పేటెంట్లలోనూ చేర్చాల్సి వచ్చింది. చిట్టచివరికి 2024లో మాజ్‌సవ్‌కు 'లాస్కర్ డి బకే' క్లినికల్ మెడికల్ రీసెర్చ్ అవార్డు దక్కింది. నుడ్ సన్, హాబెనర్ లతో కలసి ఆమె ఈ అవార్డును పంచుకున్నది. "స్థూలకాయానికి సంబబంధించిన వైద్యాన్ని విప్లవాత్మకంగా మార్చివేసిన జి.ఎల్.పి 1 మందుల ఆవిష్కరణకు, అభివృద్ధికి గాను" ఈ అవార్డును ఇస్తున్నట్టుగా ప్రకటించారు.

తరువాత ఏం జరగనున్నది?

ఈ ఔషధాలు, ఒక్క స్థూలకాయ వైద్యానికే పరిమితం కాలేదు. వివిధ రూపాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ మందులు గుండెపోటుకు, పక్షవాతానికి, మూత్రపిండాల జబ్బులకు కూడా పని చేస్తాయని క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. కొన్ని రకాల జి.ఎల్.పి 1 మందులు అల్జీమర్స్, పార్కిన్‌సన్ వ్యాధులలో తోడ్పడతాయంటున్నారు. అలాగే డీఅడిక్షన్ వైద్యంలో కూడా. ఒక పక్కన ఈ మందులకు డిమాండ్లు పెరుగుతున్నా, అవి అందరికీ అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. ఈ మందులు వాడితే ఒక మనిషికి సంవత్సరానికి 8.6 లక్షల రూపాయల ఖర్చు వస్తుంది. అమెరికా జనాభాలో కూడా 1.7 శాతం మందికి మాత్రమే ఈ ప్రిస్క్రిప్షన్లు రాశారు. వీటికి, చాలా సందర్భాలలో ఇన్సూరెన్స్ లేదు. అంటే ఈ మందుల్ని చాలా కాలం స్థిరంగా వాడాలంటే, ఖర్చు రీత్యా వీలు కాకపోవచ్చు. జనరిక్ మందులుగా ఇవి ఉత్పత్తి అవుతాయనే ఆశలు ఉన్నాయి. కానీ మేధో సంపత్తి హక్కుల అడ్డు ఉంది. ఈ నేపథ్యంలో భారతదేశంలో కూడా నూతన జి.ఎల్.పి 1 ఔషధాల ప్రవేశం సమీప భవిష్యత్తులోనే జరగనున్నది.

(స్వేచ్ఛానుసరణ)

యూపీఎస్‌సి సివిల్స్‌కు దరఖాస్తుల గడువు మరోసారి పొడిగింపు

న్యూఢిల్లీ : సివిల్ సర్వీసెస్ పరీక్ష దరఖాస్తుల గడువును యూపీఎస్‌సి మరోసారి పొడిగించింది. అఖిల భారత సర్వీసుల్లో దాదాపు 979 పోస్టుల భర్తీ కోసం అభ్యర్థులు ఫిబ్రవరి 21వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించింది.

కల్తీ నెయ్యి కేసులో
ముగిసిన నిందితుల విచారణ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసులో సిట్ అధికారులు అరెస్టు చేసిన నలుగురి నిందితుల విచారణ ముగిసింది. నిందితులను కోర్టు ఐదు రోజుల విచారణ నిమిత్తం సిట్ కస్టడీకి అప్పగించింది. మంగళవారంతో సిట్ విచారణను ముగియడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి రాత్రి వారిని తరలించి వైద్య పరీక్షల అనంతరం రెండో అదనపు కోర్టు జడ్జి ఎదుట సిట్ అధికారులు హాజరు పరిచారు. నిందితులు విచారణకు సహకరించడం లేదని, మరి కొద్దిరోజులు పోలీస్ కస్టడీకి పొడిగించాలని కోర్టును సిట్ కోరినట్టు సమాచారం. నలుగురి నిందితులకూ కోర్టు రిమాండ్ విధించింది. కల్తీ నెయ్యి కేసులో అలిపిరి పోలీసులు ఉత్తరాఖండకు చెందిన భోలే బాబా డెయిరీ మాజీ డైరెక్టర్లు పోమిల్ జైన్, విపిన్ జైన్, వైష్ణవి డెయిరీకి చెందిన వినకాంత్ చావడా, ఎఆర్ డెయిరీ ఎండి రాజశేఖర్‌లను గతంలో అరెస్ట్ చేశారు. నిందితుల బెయిల్ పిటిషన్‌పై బుధవారం విచారణ జరగనుంది.

ఎనిమిదో రోజుకు రైస్‌మిల్లు కార్మికుల సమ్మె

● ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - మందస

ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మందస, సిద్ధారు రైస్‌మిల్లు కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా మందసలో నిర్వహించిన ర్యాలీలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ మోహనరావు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన సవరణ చేయాలని కోరుతూ యాజమాన్యాలకు ఎనిమిది నెలల కిందట నోటీసు ఇచ్చినా స్పందన లేదని విమర్శించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ వంటి పథకాలను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. యాజమాన్యాల మొండివైఖరి కార్మికులకు సమ్మెలోకి నెట్టిందన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యం వ్యవహరిస్తూ కార్మిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, అదనపు పనికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంటనే జోక్యం చేసుకొని రైస్‌మిల్లు కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం ధర్మారావు, టి లక్ష్మీనారాయణ, కె కేశవరావు, టి యాకాశి, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రైస్‌మిల్లు కార్మికులు

హెలికాప్టర్ స్కామ్ కేసులో క్రిస్టియన్‌కు బెయిల్

న్యూఢిల్లీ : అగస్టా వెస్ట్‌లాండ్ ఛాపర్ స్కామ్ కేసులో క్రిస్టియన్ మిచెల్ జేమ్స్‌కు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. 2018లో జరిగిన కేసు విచారణ ఈ వేగంతో అయితే 25 ఏళ్ల అయినా విచారణ పూర్తి కాకపోవచ్చు అని వ్యాఖ్యానించింది. ఈ కేసును శుక్రవారానికి వాయిదా వేయాలన్న అభ్యర్ధనను న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. ఈ కేసులో తమ క్లయింట్ 2018లో అరెస్టయినప్పటికీ.. గత ఆరేండ్లుగా అండర్ ట్రయల్ కస్టడీలోనే ఉన్నారని మిచెల్ తరపు న్యాయవాదులు అల్జో జోసెఫ్, శ్రీరామ్ పరక్కత్, ఎంఎస్ విష్ణు శంకర్ అన్నారు. కేవలం ఆరోపణలు ఎదుర్కొన్నందుకే కస్టడీలో ఉంచారు. ఓ రకంగా ఈ కేసులో దోషిగా రుజువైతే.. కస్టడీలో జైలులో ఉన్న సమయం.. తనకు పడే జైలు శిక్షతో సమానమని మిచెల్ అన్నారు.

గ్రూప్-2పై పిటిషన్లపై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

గ్రూప్-2 నోటిఫికేషన్‌లో వికలాంగులు, మహిళలు, ఎక్స్ సర్వీస్‌మెన్, క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ నిమిత్తం ఈ నెల 23న నిర్వహించనున్న ప్రధాన పరీక్షను నిలుపుదల చేయాలని అనుబంధ పిటిషన్ దాఖలైంది. వీటిని మంగళవారం విచారణ పూర్తి చేసిన జస్టిస్ సుబ్బారెడ్డి తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్మీ సబార్డినేట్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి గ్రూప్-2 పోస్టుల భర్తీకి రిజర్వేషన్ల రోస్టర్లు ఖరారు చేయాలని ఎం పార్థసారధి పిటిషన్ దాఖలు చేశారు. గ్రూప్-2లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీలో ఆ రిజర్వేషన్ కల్పనతో ప్రత్యేక రోస్టర్లు ఖరారు చేయడాన్ని కడపకు చెందిన కసుపర్తి పెంచలయ్య, ఇతరులు వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ నెల 23న జరగనున్న గ్రూప్-2 ప్రధాన పరీక్షను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ల న్యాయవాదులు కోరారు. దీనిపై ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ, ప్రిలిమినరీ పరీక్ష ఇప్పటికే పూర్తయిందని అన్నారు. మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

టెలికాలింగ్, ఐవిఆర్ఎస్ ద్వారా ఓట్లు

● కోరాలన్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టెలికాలింగ్, ఐవిఆర్ఎస్ ద్వారా పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించాలని మంత్రి నారా లోకేష్ సూచించారు. ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై టిడిపి నేతలతో ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిపక్షం పోటీలో లేదనే నిర్లక్ష్యం వద్దని, రాబోయే వారం రోజులు పార్టీ నేతలంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యేలు కీలక భూమిక పోషించాలని ఆదేశించారు. అభ్యర్థుల విజయం కోసం గురువారం నుంచి ప్రణాళిక అమలు చేస్తున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశంలో ఎంపి భరత్, ఎమ్మెల్యేలు వేవడ చిరంజీవి, శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, జోనల్ కో-ఆర్డినేటర్ సుజయకృష్ణ రంగారావు, సత్యనారాయణరాజు, దామచర్ల సత్య, శ్రీనివాసులు రెడ్డి, అశోక్‌బాబు పాల్గొన్నారు.

జగన్‌వి అబద్ధాలు

అబద్ధాలు చెప్పడంలో మాజీ సిఎం వైఎస్ జగన్ పిహెచ్‌డి చేసినట్లు ఉన్నారని మంత్రి లోకేష్ విమర్శించారు. ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారనే భ్రమలో నుంచి ఇకనైనా బయటకు రావాలని ఒక ప్రకటనలో తెలిపారు. 100 మందికి పైగా వైసిపి రౌడీలు తమ కార్యాలయంపై దాడి చేయడం ప్రజలు కళ్లారా చూశారన్నారు.

విక్రాంత్‌రెడ్డి పిటిషన్‌పై తీర్పు వాయిదా


ప్రజాశక్తి-అమరావతి

కాకినాడ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో సిఐడి నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైవి విక్రాంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాలను అరబిందో సంస్థ కొనుగోలు చేసిందని పేర్కొంటూ పోర్టు ప్రమోటర్ కెవిరావు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని విక్రాంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

విజయ్‌కుమార్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ప్రభుత్వ ప్రకటన జారీ, బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఎసిబి నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ అప్పటి సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు మంగళవారం ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ప్రకటించారు. ఒక పత్రికకు గత వైసిపి ప్రభుత్వం ఎక్కువ ప్రకటనలు ఇచ్చిందని, ఇతర పత్రికల పట్ల వివక్ష చూపిందని, చట్టాన్ని ఉల్లంఘించారని ఆయనపై కేసు నమోదైంది.



చైతన్యరెడ్డిపై కఠిన చర్యలొద్దు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు అప్రూవర్ షేక్ దస్తగిరి చేసిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో దేవిరెడ్డి చైతన్యరెడ్డికి హైకోర్టు ఊరట లభించింది. ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. విచారణ ఈ నెల 25కు వాయిదా వేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు రిమ్స్ పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ చైతన్యరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

వంశీని ఎందుకు ములాఖత్ అయ్యారు

● జగన్‌కు పల్లా శ్రీనివాస్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని జైల్లో ఎందుకు ములాఖత్ అయ్యారో సమాధానం చెప్పాలని మాజీ సిఎం వైఎస్ జగన్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ మేరకు జగన్‌కు పల్లా మంగళవారం బహిరంగ లేఖ రాశారు. జైల్లో ఉన్న వంశీ దళిత వ్యతిరేకి, మహిళా ద్రోహి అని, దళితులు కన్నా నేరస్తుడు ఎక్కువా? అని ప్రశ్నించారు. సంకల్ప సిద్ధి చిట్స్ ఫండ్స్ ద్వారా 16 వేల కుటుంబాలను రోడ్డున పడేసిన వంశీని ఎలా పరామర్శిస్తారని ప్రశ్నించారు.

కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన కేసులో అరెస్టయిన వంశీని జగన్ పరామర్శించడం సరికాదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తితో కలిసి టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అరాచకాలపై ముఖ్యమంత్రి హోదాలో ఒక్కసారైనా జగన్ స్పందించారా? అని ప్రశ్నించారు. రౌడీలు, దొంగలకు జగన్ వత్తాసు పలుకుతున్నారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ మంత్రి పీతల సుజాతతో కలిసి వినతులు స్వీకరించారు. అనంతరం అనగాని మీడియాతో మాట్లాడుతూ.. గతంలో అధికారం కోసం బూటకపు ఓదార్పు యాత్ర చేసిన జగన్ ఇప్పుడు మరో బూటకపు జైలు యాత్ర నిర్వహించారని విమర్శించారు. జగన్ వంటి దుర్మార్గపు ఆలోచనలో ఉన్న వ్యక్తిని సమాజంలో తాను చూడలేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు.

విడదల రజినికి ఊరట

ప్రజాశక్తి-అమరావతి

చిలకలూరిపేట టౌన్ పోలీసులు పెట్టిన కేసులో మాజీ మంత్రి విడదల రజిని, ఆమె పిఎలు నాగశెట్టి జయ ఫణీంద్ర, రామకృష్ణకు హైకోర్టులో మంగళవారం ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 20కు వాయిదా వేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిలకలూరిపేట టిడిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి పిల్లి కోటి చేసిన ఫిర్యాదు మేరకు వాళ్లపై పోలీసులు బిఎన్ఎస్ సెక్షన్లతోపాటు ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారు పిటిషన్లు దాఖలు చేశారు.


గంగ నీటిలో మల బ్యాక్టీరియా !

• ఎన్‌జిటి ఆందోళన

న్యూఢిల్లీ : మహా కుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించేందుకు యాత్రికులు లక్షలాదిగా పోటెత్తుతున్నారు. అయితే ప్రయాగరాజ్‌లోని గంగానదిలో మల సంబంధమైన బ్యాక్టీరియా అధిక స్థాయిలో పెరుగుతోందని కాలుష్య నియంత్రణ సంస్థ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై తీసుకుంటున్న చర్యలేమిటో వివరించాలని ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులను ఆదేశించింది. బుధవారంలోగా సవివరమైన నివేదిక అందజేయాలని డిమాండ్ చేసింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) అందజేసిన నివేదిక ఆధారంగా ఎన్‌జిటి ఈ చర్యలు చేపట్టింది. ఈ నెల 3న సిపిసిబి అందించిన నివేదిక ప్రకారం మహా కుంభమేళా సమయంలో మానవ మల సంబంధమైన బ్యాక్టీరియా గణనీయంగా పెరుగుతోంది. 'నదీ జలాలు స్నానం చేయడానికి అనువుగా లేవు. జనవరి 12-13 తేదీల్లో నదీ జలాలను పరీక్షించాం. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బిఒడి)కు కావాల్సిన ప్రమాణాలు నీటిలో లేవు. అంతేకాదు...స్నానం చేసే నీరు నాణ్యమైనదిగా ఉండాలి. అయితే అనేక పర్యాయాలు పరీక్షించినప్పటికీ ప్రమాణాలకు అనుగుణంగా లేదు. మహా కుంభమేళా సందర్భంగా ప్రజలు భారీగా గంగలో స్నానం చేస్తున్నారు. మల బ్యాక్టీరియా పెరగడానికి, కాలుష్యానికి ఇది కారణమవుతోంది. మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంట్లు ఉన్న చోట స్నానాలు, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించినప్పుడు కాలుష్య స్థాయి పెరుగుతోంది' అని నివేదిక వివరించింది. నివేదికను కోల్‌కత్తా హైకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ శ్రీవాత్సవ నేతృత్వంలోని ట్రిబ్యునల్ పరిశీలించింది. బుధవారం వర్చువల్‌గా తన ఎదుట హాజరు కావాలని ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులను ఆదేశించింది.

ఆదాయపన్ను బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనలా ?

• మోడీ ప్రభుత్వ తీరుపై నిపుణుల విమర్శలు



న్యూఢిల్లీ : నూతన ఆదాయపన్ను బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనలను చేర్చడంపై నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ గత సంవత్సరం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. దానిని మరో రూపంలో తీసుకురావాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని నిపుణులు విమర్శిస్తున్నారు. నూతన ఆదాయపన్ను బిల్లులోని 8వ షెడ్యూలులో ఎన్నికల బాండ్ల ప్రస్తావన ఉంది. 'రాజకీయ పార్టీలు, ఎలక్టోరల్ ట్రస్టుల మొత్తం ఆదాయంలో ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని చేర్చకూడదు' అని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 1961 సంవత్సరపు ఆదాయపన్ను చట్టం ప్రకారం ఎన్నికల బాండ్ల ద్వారా కంపెనీలు, వ్యక్తుల నుండి వచ్చిన విరాళాల నుండి రాజకీయ పార్టీలకు మినహాయింపు ఉంది. 64 సంవత్సరాల నాటి ఐటీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతన ఆదాయపన్ను బిల్లును తీసుకొచ్చింది. చట్టానికి 4000కు పైగా సవరణలు చేసినందున అది సంక్లిష్టంగా మారిందని, అందుకే దానిని సరళీకరించి 622 పేజీల బిల్లును తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతోంది.

ప్రభుత్వ చర్యలు చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసేందుకు వాటిని సమీక్షించడం, పర్యవేక్షించడం సాధారణంగా జరిగే పనే. అందుకోసం కొత్త బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనను చేర్చి ఉండవచ్చునని లేదా భవిష్యత్తులో ఆ పథకాన్ని సవరించి మరో దారిలో తీసుకొచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం కూడా కావచ్చునని ఏఎంఆర్‌జీ అండ్ అసోసియేట్స్ సీనియర్ భాగస్వామి రజత్ మోహన్ చెప్పారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిన సమయంలో కొన్ని అంశాలను లేవనెత్తిందని, వాటిని వ్యవస్థీకృత చర్చలు, నిపుణులతో సంప్రదింపుల ద్వారా పరిష్కరించవచ్చునని ఆయన సూచించారు. అయితే సవరించిన రాజకీయ విరాళాల వ్యవస్థను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం తనకున్న శాసనాధికారాన్ని అట్టే పెట్టుకున్నదని అన్నారు. కొత్త బిల్లులో ఎన్నికల బాండ్ల ప్రస్తావన తేవడం వ్యూహాత్మక నిర్ణయం కావచ్చునని, దీని ద్వారా భవిష్యత్తులో ఎన్నికల నిధులకు సంబంధించిన సంస్కరణలకు అవకాశం కలుగుతుందని చెప్పారు.

శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కంపెనీ భాగస్వామి రోహిత్ గార్గ్ మాట్లాడుతూ కొత్త ఆదాయపన్ను బిల్లులో చేసిన మార్పులు స్వభావరీత్యా కేవలం నిర్మాణ సంబంధమైనవేనని అన్నారు. నిబంధనలు, సెక్షన్లలో ప్రధాన మార్పులేవీ లేవని చెప్పారు. 'ఎన్నికల బాండ్ల జారీని నిలిపివేయాలని ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ తీర్పును ప్రతిబింబించేలా సంబంధిత చట్టాల్లో సవరణలు చేయాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఎన్నికల బాండ్లు జారీ చేయాల్సి వచ్చినా వాటిని డిడక్షన్‌గా అనుమతిస్తారు. ఏదేమైనా దాతల వివరాలకు బహిర్గతం చేసే అంశాన్ని సంబంధిత చట్టాల కిందే పరిష్కరించాల్సి ఉంటుంది' అని అన్నారు.

2018లో ఎన్నికల బాండ్ల పథకం ప్రారంభమైంది. అప్పటి నుండి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎనిమిది దఫాలుగా రూ.16,518 కోట్ల విలువైన బాండ్లు జారీ చేసింది. ఎనిమిదో షెడ్యూల్ ప్రకారం ఏ రాజకీయ పార్టీ అయినా తాను పొందిన స్వచ్ఛంద విరాళాలపై పన్ను మినహాయింపు కోరాలంటే ఆరు షరతులు పాటించాల్సి ఉంటుంది. అందులో ఒక షరతు ప్రకారం...రాజకీయ పార్టీ రెండు వేల రూపాయల కంటే ఎక్కువ విరాళం పొందకూడదు. అయితే అకౌంట్ పేఈ చెక్కు, అకౌంట్ పేఈబ్యాంక్ డ్రాఫ్ట్, ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సిస్టమ్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతి ద్వారా అంతకు మించిన మొత్తంలో విరాళం తీసుకోవచ్చు.

ఎలన్ మస్క్ డోజ్ ఉద్యోగి కాదు !

• ఆయనకు నిర్ణయాధికారాలేవని వైట్‌హౌస్ ప్రకటన

వాషింగ్టన్ : ఎలన్ మస్క్, డోజ్ (ప్రభుత్వ సామర్థ్య విభాగం) అధికారిక ఉద్యోగి కాదని వైట్‌హౌస్ ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయాలు తీసుకునే అధికారం ఆయనకు లేదని స్పష్టం చేసింది. ప్రపంచ కుబేరుల్లో ఒకరైన మస్క్, ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్ డీ ఫ్యాక్టో అధినేతగా వ్యవహరిస్తున్నారు. వేలాది ఉద్యోగాల్లో కోత విధించడంతో పాటూ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలంటూ ట్రంప్ ఈ సంస్థను ఏర్పాటు చేశారు. మస్క్, అధ్యక్షుడు ట్రంప్‌నకు సీనియర్ సలహాదారుడని, ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగి అని అడ్మినిస్ట్రేషన్ కార్యాలయ డైరెక్టర్ జోషువా ఫిషర్ సోమవారం తెలిపారు. వైట్‌హౌస్ సీనియర్ సలహాదారులు మాదిరిగానే మస్క్‌కు కూడా తనంతట తాను ప్రభుత్వ నిర్ణయాలు తీసుకునే అధికారం లేదని కేవలం అధ్యక్షుడికి సలహా మాత్రమే ఇవ్వగలరని, అధ్యక్షుడి ఆదేశాలను తెలియచేస్తారని ఫిషర్ చెప్పారు. వైట్‌హౌస్ కోర్టు ఫైలింగ్‌లో ఆయన ఈ విషయం వెల్లడించారు. న్యూ మెక్సికోతో సహా 14 అమెరికా రాష్ట్రాలు మస్క్‌పై తీసుకువచ్చిన కేసులో ఫిషర్ ఈ ఫైలింగ్ నమోదు చేశారు.

ట్రంప్, పుతిన్ భేటీ ఖరారు కాలేదు

• వెల్లడించిన క్రెమ్లిన్ • రియాద్‌లో ఇరు దేశాల అధికారుల చర్చలు
• ఉక్రెయిన్ యుద్ధ విరమణ పైనా దృష్టి ?



రియాద్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య సమావేశానికి ఎలాంటి తేదీ నిర్ధారించలేదని క్రెమ్లిన్ అధికారులు మంగళవారం తెలిపారు. రియాద్‌లో రష్యా, అమెరికా అధికారులు జరిపిన చర్చలకు హాజరైన పుతిన్ విదేశాంగ వ్యవహారాల సలహాదారుడు యూరి యుష్‌కొవ్ రష్యా చానెల్‌తో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఈ సమావేశంలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో సహా ఇరు దేశాల అధికారులు పాల్గొన్నారు. వచ్చే వారం ఇరు నేతల సమావేశం జరగకపోవచ్చని, దీనిపై ఇంకా ఇరు దేశాల ప్రతినిధి బృందాలు కసరత్తు చేయాల్సి వుందని యుష్‌కొవ్ చెప్పారు. రష్యా, అమెరికా మధ్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంపై, ఉక్రెయిన్‌లో యుద్ధానికి స్వస్తి పలకడంపై ఇరు దేశాల చెందిన ఉన్నతాధికారులు మంగళవారం రియాద్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ నేతృత్వంలో అమెరికా విదేశాంగ విధానంలో అకస్మాత్తుగా వచ్చిన ప్రధాన మార్పుకు సంకేతంగా ఈ చర్చలు జరిగాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. అలాగే ఇరువురు అధ్యక్షుల మధ్య భేటీకి మార్గం సుగమం చేసేందుకు ప్రయత్నించారు. కాగా ఈ సమావేశంలో ఉక్రెయిన్ అధికారులెవరూ పాల్గొనలేదు. దాదాపు మూడేళ్ళ క్రితం ప్రారంభమైన ఈ యుద్ధంలో రష్యా బలగాలు క్రమేపీ పట్టు సాధిస్తుండడంతో ఉక్రెయిన్ బలగాలు బలహీనపడుతున్నాయి. కీవ్ ఈ చర్చల్లో పాల్గొనకపోయినా ఈ సమావేశాల్లో ఏదో ఫలితం వచ్చేస్తుందని తాము భావించలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. తాజా సమావేశం పట్ల యురోపియన్ మిత్రపక్షాల్లో భయాందోళనలు తలెత్తాయి. కాగా, శాంతి చర్చలకు తాము సిద్ధమని పుతిన్ పదే పదే చెబుతూ వస్తున్నారని క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ మంగళవారం వ్యాఖ్యానించారు. యూరప్‌లో భద్రతా అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోనిదే ఉక్రెయిన్‌లో శాశ్వత శాంతి, సుస్థిర పరిష్కార మార్గం సాధ్యం కాదని పెస్కోవ్ చెప్పారు.

అర్ధరాత్రి నిర్ణయాలు అమర్యాదకరం

• సిఇసి ఎంపికపై రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ : భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సిఇసి)గా జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. అర్ధరాత్రి నిర్ణయాలు అమర్యాదకరమని పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్‌లో మంగళవారం పోస్టు చేశారు. సిఇసి ఎంపికపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతుండగానే.. ప్రధాన మంత్రి మోడీ, హోంమంత్రి అమిత్‌షా లు అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. 'తదుపరి ఎన్నికల కమిషనర్ ఎంపికకు కమిటీ సమావేశంలో మోడీ, అమిత్‌షాలకు అభ్యంతరాల నివేదికను అందించాం. కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం లేని స్వతంత్ర ఎన్నికల కమిషన్‌లో అత్యంత ప్రాథమిక అంశం ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే ప్రక్రియ. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తూ.. అర్ధరాత్రి వేళ నూతన సిఇసిని ఎంపిక చేశారు. ఇది మన ఎన్నికల ప్రక్రియపై కోట్లాది ప్రజల్లోని ఆందోళనలను తీవ్రతరం చేసింది. సిఇసి నియామకంపై ఈ నెల 19న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈ క్రమంలోనే మోడీ సర్కారు తీసుకున్న నిర్ణయం సరికాదు' అని రాహుల్ తెలిపారు. సిఇసి ఎంపిక కమిటీలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణ ముగిసే వరకు కొత్త సిఇసిపై నిర్ణయాన్ని వాయిదావేయాలని సోమవారం జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో పాల్గొన్న రాహుల్ గాంధీ సూచించారు.



శాకాంబరి



చిట్టి రామయ్య కమ్యూనిటీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతోంది. విద్యార్థులంతా ఈ సమ్మేళనం వినూత్నంగా రూపొందించారు. తాము ఆ పాఠశాలలో ఉండగా బయట ఏయే తినుబండారాలు అమ్మేవారో అవి తెప్పించుకున్నారు. ఆనాడు బోధించిన అధ్యాపకుల హావభావాలు, వాళ్ళు చెప్పిన తీరు తమను ఎలా ఆకట్టుకున్నది టీచర్ల ముందు చేసి చూపారు. ఇలా రకరకాల అంశాలతో పది ఈవెంట్లుగా కార్యక్రమాన్ని రూపొందించారు. చివరిగా ఉపాధ్యాయులను సన్మానించే కార్యక్రమం మొదలైంది. ఒక్కొక్కరిని వేదికమీదికి ఆహ్వానించి చిట్టి రామయ్యతో శాలువా కప్పి, మెమెంటో, నగదు, బంగారు ఉంగరం బహుకరించారు. చివరగా చిట్టి రామయ్య పంతులుని, వారి భార్య దుర్గాదేవిని సన్మానించారు.


విద్యార్థులందరి తరపున హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న లక్ష్మణ రావు సన్మాన పత్రం చదివారు. 'ఇప్పుడు ఈ శుభ సమయంలో చిట్టి రామయ్య , దుర్గాదేవి గార్ల విశిష్టత చెప్పటం మా ప్రధాన కర్తవ్యం. నాడు మాలో చాలామందికి తినడానికి సరైన ఆహారం లేని రోజులు. కడు బీద కుటుంబాలు మావి. కూలి పనికి వెళ్తే పూట కూలీ కూడా పుట్టని రోజులు. ఎలాగోలాగ చదువొస్తే చాలు ఏ ఉద్యోగమన్నా రాకపోదా అని ఇక్కడ చేరాం. మాలో చాలా మంది ఎర్రకారం, ఉల్లిపాయ ఉన్న డబ్బా భోజనంగా తెచ్చుకొనేవారం. కూరలు, పండ్లు మా ఊహకు కూడా అందని ఆహారాలు. అలాంటి టిఫిన్ డబ్బాలను చెక్ చేసి, భోజనం అయ్యాక, ఖాళీ అయిన డబ్బాలలో రోజుకొక ఆకుకూర, వంట సామానులు పెట్టే వారు దుర్గాదేవి. అలా మా ఇళ్లలో ఆకు కూరల భోజనం చేయటం ప్రారంభమైంది. రోజుకొకటి చొప్పున ఆవిడ ఇవ్వటం, మేము తినటం వలన మా ఆరోగ్యం, జీర్ణశక్తి అన్నీ మెరుగయ్యాయి. పాఠశాల వదిలి కళాశాలకు వెళ్లినా మా ఆహారంలో ఆకుకూరలు ప్రధాన భాగమయ్యాయి' అని ముగించాడు లక్ష్మణ రావు.

తన చిరు ఉపకారం వారికింతలా మేలు చేసినందుకు, దాన్ని ఇప్పటికీ గుర్తుపెట్టుకుని చెప్పినందుకు దుర్గాదేవి చాలా ఆనందపడ్డారు. అప్పుడు ఉన్నపళంగా పూర్వవిద్యార్థులంతా దుర్గాదేవిని 'శాకాంబరి' 'శాకాంబరి' అంటూ గట్టిగా పిలిచారు. ఆ సమయంలో సభలోని వారంతా కూడా అలానే పిలిచారు. చేసిన సాయం చిన్నదైనా దాన్ని ఇంతలా గుర్తుపెట్టుకున్న పూర్వ విద్యార్థుల బృందాన్ని చిట్టిరామయ్య తడిబారిన కన్నులతో గట్టిగా ఆలింగనం చేసుకున్నారు.


- డా.కొప్పరపు నారాయణ మూర్తి, పిహెచ్‌డి,
76769 09759.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేయండి. సమాధానంతో సరిపోయే అంకెలు రాగానే పక్కనే బాక్సులో ఇచ్చిన బొమ్మల పక్కన రాయండి.



నేను గీసిన బొమ్మ





- ఎస్.నవ్‌తేజ్, 2వ తరగతి, జాకేరు, వేపాడ(మం), విజయనగరం.

పోరాటాల మేదోమథనానికి విరాళాలతో ప్రజల అండ

సిపిఎం అఖిలభారత మహాసభకు సిద్ధమౌతున్న తమిళనాడు



ప్రజాశక్తి- చెన్నై

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ అఖిలభారత మహాసభకు తమిళనాడు వ్యాప్తంగా ప్రజానీకం నుండి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. ఏప్రిల్ రెండవ తేది నుండి ఆరవ తేది వరకు తమిళనాడులోని మధురైలో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మహాసభకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలనుండిఎన్నికైన ప్రతినిధు లు తరలిరానున్నారు. అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులపై ఐదురోజులు చర్చించి భవిష్యత్ వ్యూహాన్ని, కర్తవ్యాలను రూపొందించుకోనున్నారు. పోరాటయోధులు సాగించే ఈ మేదోమథనానికి ప్రజానీకం తమ వంతు సహకారాన్ని అందిస్తోంది. మహాసభ నిర్వహణలో భాగంగా సిపిఎం శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా సామాన్య ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు అడుగుతున్నారు. అగ్ర నాయకులు సైతం ప్రజల వద్ద జోలె పడుతున్నారు.

కష్టకాలంలో అండగా నిలిచిన పార్టీ నేతలు జోలి పట్టి తమ వద్దకు వస్తుండటంతో ప్రజానీకం ఉదారంగా స్పందిస్తోంది. తమ కోసం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తుచేసుకుంటూ ప్రజలు తమ వంతు సాయాన్ని అందిస్తున్నారు. పురాసాయివక్కమ్ మార్కెట్ ఏరియా ప్రాంతంలో చెన్నై సెంట్రల్ ఏరియా కమిటీ తరపున 15 బృందాలు ఈ కార్యక్రమంలో నిమగ్నమైనాయి. ఈ కారక్రమంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు కె. బాలకృష్ణన్, సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం పెరుమాళ్, పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు టికె రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు. సాధారణ ప్రజల నుండి, వీధి వ్యాపారస్తుల నుండి ఇక్కడ విరాళాలు సేకరించారు. సోమవారం ఉదయం గంట సమయంలోనే ఇక్కడ 1.42 లక్షల రూపాయాలను ప్రజానీకం విరాళంగా ఇచ్చినట్లు ఎగ్మూర్ ఏరియా కమిటీ ప్రకటించింది. అన్నా నగర్ ప్రాంతంలో సీనియర్ నాయకులు డికె రంగరాజన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ కూడా ప్రజానీకం ఉదారంగా విరాళాలు ఇచ్చారు. మహాసభ విజయవంతం కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధమైన స్పందన వ్యక్తమవుతున్నట్లు సిపిఎం నేతలు తెలిపారు.

సిపిఎం జమ్మూకాశ్మీర్ కార్యదర్శిగా అబ్బాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం జమ్మూకాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శిగా మహమ్మద్ అబ్బాస్ ఎన్నికయ్యారు. 21 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. జమ్మూలో రెండు రోజుల పాటు జరిగిన సిపిఎం రాష్ట్ర 13వ మహాసభ మంగళవారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం సమన్వయకర్త ప్రకాష్ కరత్, పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ దావలే, కేంద్ర కమిటీ సభ్యులు మొహమ్మద్ యూసుఫ్ తరిగామి తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి గులాం నబీ మాలిక్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. కార్యదర్శి సమాధానం తరువాత నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర నూతన కార్యదర్శిగా మహమ్మద్ అబ్బాస్ ఎన్నికయ్యారు. సిపిఎం జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర మహాసభ రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదా కోసం పోరాటానికి పిలుపు ఇచ్చింది.

తొలి పోరులో గెలుపెవరిదో..?

- నేటినుంచి ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం

కరాచీ: ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉన్న ఎనిమిది జట్ల మధ్య జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ నేటినుంచి ప్రారంభం కానుంది. ఆతిథ్య పాకిస్తాన్‌జట్టు న్యూజిలాండ్‌తో బుధవారం తొలి లీగ్‌లో తలపడనుంది. ఈ టోర్నీలో ఆడే ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించగా.. గ్రూప్-ఎలో ఉన్న భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను గురువారం(20న) బంగ్లా దేశ్‌తో ఆడనుంది. చాంపియన్స్ ట్రోఫీ-2025కు టీమిండియా పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ మెగా ఈవెంట్లో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగనున్న రోహిత్ సేనకు లీగ్ దశలోని మూడు మ్యాచ్‌లు కీలకమే. ఇందులో ఒక్కటి ఓడినా సెమీఫైనల్ చేరే అవకాశాలు చేజారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తుదిజట్టు ఎంపిక విషయంలో జట్టు మేనేజ్‌మెంట్ తీవ్ర కసరత్తు చేసింది. టీమిండియా ఆడే తొలి మ్యాచ్‌కు తన ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎవరెవరికి చోటు కల్పించాలనే విషయమై ఆచితూచి వైఖరి అవలంభిస్తోంది.

కేఎల్ రాహుల్ × పంత్..

వికెట్ కీపర్ కోటాలో కేఎల్ రాహుల్, రిషబ్ పంత్‌ల మధ్య స్నేహపూర్వక పోటీ నెలకొంది. వీరిద్దరూ మంగళవారం ప్రాక్టీస్ లో చెమటలు చిందించారు. ఒకవైపు రిషబ్ పంత్ తుది జట్టులో సంపాదించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుండగా.. మరోవైపు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో రాణించిన కెఎల్ రాహుల్ భారీ షాట్లకే అధిక ప్రాధాన్యతను ఇచ్చాడు. అలాగే ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌తోపాటు భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సైతం ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. ఈ క్రమంలో హార్దిక్ పాండ్యా వేసిన ఒక బంతిని భారీ షాట్ ఆడబోయిన రిషబ్ పంత్ మోకాలికి తాకింది. అయితే, రిషబ్ పంత్‌కు గాయమైందా? అతడి ఫిట్‌నెస్‌పై జట్టు మేనేజ్‌మెంట్ ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఫెర్గుసన్ ఔట్...

ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందే న్యూజిలాండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ లూకీ ఫెర్గుసన్ గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. అతని స్థానంలో కైలే జెమీసన్‌ను చోటు కల్పిస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. న్యూజిలాండ్ జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను పాకిస్తాన్‌తో 19న తలపడనుంది.



ఛాంపియన్స్ ట్రోఫీలో నేడు
పాకిస్తాన్ × న్యూజిలాండ్
(వేదిక: కరాచీ; సమయం: మ. 2.30గం॥లకు)

షెడ్యూల్

తేది	మ్యాచ్‌లు	వేదిక
19(బుధ)	పాకిస్తాన్ × న్యూజిలాండ్	కరాచీ
20(గురు)	**భారత్ × బంగ్లాదేశ్**	**దుబాయ్**
21(శుక్ర)	ఆఫ్ఘనిస్తాన్ × దక్షిణాఫ్రికా	కరాచీ
22(శని)	ఆస్ట్రేలియా × ఇంగ్లండ్	లాహోర్
23(ఆది)	**భారత్ × పాకిస్తాన్**	**దుబాయ్**
24(సోమ)	బంగ్లాదేశ్ × న్యూజిలాండ్	రావల్పిండి
25(మంగళ)	ఆస్ట్రేలియా × దక్షిణాఫ్రికా	రావల్పిండి
26(బుధ)	ఆఫ్ఘనిస్తాన్ × ఇంగ్లండ్	లాహోర్
27(గురు)	పాకిస్తాన్ × బంగ్లాదేశ్	రావల్పిండి
28(శుక్ర)	ఆఫ్ఘనిస్తాన్ × ఆస్ట్రేలియా	లాహోర్
మార్చి1(శని)	దక్షిణాఫ్రికా × ఇంగ్లండ్	కరాచీ
02(ఆది)	**భారత్ × న్యూజిలాండ్**	**దుబాయ్**
04(మంగళ)	**సెమీఫైనల్-1**	
05(బుధ)	**సెమీఫైనల్-2**	
09(ఆది)	**ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్**	

నోట్: ప్రతిరోజు మధ్యాహ్నం 2.30గం॥ల నుంచి

ముంబయి బోణీ

- స్కీవర్ బ్రంట్ ఆల్‌రౌండ్ ప్రతిభ
- గుజరాత్ జెయింట్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలుపు



కమలినికి ఐపిఎల్ అరంగేట్రం క్యాప్‌ను అందజేస్తున్న ఆటగాళ్లు

వడోధర: ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల చేతిలో తొలి లీగ్‌లో ఓడిన ముంబయి ఇండియన్స్ మహిళలు రెండో లీగ్ మ్యాచ్‌లో గుజరాత్‌పై సమిష్టిగా రాణించింది. తొలుత ముంబయి మాథ్యూస్(3/16), స్కీవర్ బ్రంట్(2/26), అమేలియా కెర్ర్(2/22) కట్టడిగా బౌలింగ్ చేయడంతో గుజరాత్‌ను 120పరుగులకే పరిమితం చేసి.. ఆ లక్ష్యాన్ని ముంబయి జట్టు 16.1ఓవర్లలో కేవలం 5వికెట్లు కోల్పోయి సునాయాసంగా గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 120పరుగులకే కుప్పకూలింది. కొటాంబి స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జెయింట్స్ ఓపెనర్లు బెత్ మూనీ(1), లారా వొల్వర్ట్(4) పూర్తిగా విఫలం కాగా.. వన్‌డౌన్ బ్యాటర్ దయాళన్ హేమలత(9), నాలుగో స్థానంలో వచ్చిన కెప్టెన్ ఆష్లీ గార్డనర్(10) కూడా నిరాశపరిచారు. ఈ క్రమంలో హర్లీన్ డియోల్ ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేసింది. 31 బంతుల్లో 32 పరుగులు చేసిన హర్లీన్ అమన్‌జోత్ కౌర్ బౌలింగ్‌లో హేలీ మాథ్యూస్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. హార్డ్ హిట్టర్ డియాంద్రా డాటిన్ ఏడు పరుగులకే నిష్క్రమించగా.. కశ్వీ గౌతమ్ 20 పరుగులతో ఫర్వాలేదనిపించింది. ఇక లోయర్ ఆర్డర్‌లో సిమ్రన్ షేక్ 3, తనూజా కన్వర్ 13, సయాలీ సత్‌ఘరే 13(నాటౌట్), ప్రియా మిశ్రా(2) పరుగులు చేశారు. దీంతో గుజరాత్ 20 ఓవర్లలో 120 పరుగులు చేసిన గుజరాత్ ఆలౌట్ అయింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబయి ఓపెనర్ మాథ్యూస్(17), యాస్టికా భాటియా(8) ధాటిగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. వీరిద్దరూ ఔటయ్యాక స్కీవర్ బ్రంట్(57; 39బంతుల్లో 11ఫోర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌ను చెలరేగింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్(4) నిరాశపరిచినా.. కెర్ర్(19) మ్యాచ్‌ను గెలుపు తీరాలకు చేర్చారు. సజన(10), కమలిని(4) మ్యాచ్‌ను ముగించారు. గుజరాత్ బౌలర్లు ప్రియా మిశ్రా, గౌతమ్‌కు రెండేసి, తనూజకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్కీవర్ బ్రంట్‌కు దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68